PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 44 సంచిక : 45 | Vijayawada, Sunday 15 September 2024 | 8 + 8 పేజీలు + స్నేహ వెల : 7.00
Vol No | విజయవాడ, ఆదివారం 15 సెప్టెంబర్ 2024 | Rs



కమ్యూనిస్టు యోధునికి కన్నీటి వీడ్కోలు

పార్టీలకతీతంగా నివాళులర్పించిన నేతలు

- బారులు తీరిన ప్రజానీకం
- ఉద్వేగ భరితంగా అంతిమయాత్ర
- ఎయిమ్స్‌కు ఏచూరి భౌతిక కాయం అప్పగింత



ఏచూరి భౌతికకాయాన్ని ఎయిమ్స్‌కు అందజేసిన అనంతరం కుటుంబ సభ్యులకు సర్టిఫికెట్‌ను ఇస్తున్న వైద్యులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

అలుపెరగని పోరాట యోధుడు, మార్క్సిస్టు మేధావి గురువారం కన్నుమూసిన సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి అశేష ప్రజానీకం కన్నీటి వీడ్కోలు పలికింది. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుండి తరలివచ్చిన వేలాదిమంది సిపిఎం కార్యకర్తలు, వామపక్ష అభిమానులు, ప్రగతిశీల, లౌకిక వాదులు తమ ప్రియతమ కామ్రేడ్‌కు తుది వీడ్కోలు పలికారు. అంతకుముందు శనివారం ఉదయం నుండే ప్రజల సందర్శనార్థం ఆయన భౌతికకాయం ఉంచిన సిపిఎం కేంద్ర కార్యాలయం ఎకెజి భవన్ వద్ద ఉద్వేగభరిత వాతావరణం నెలకొంది. ఉదయం పదిగంటలకు ఏచూరి భౌతిక కాయాన్ని ఆయన నివాసం నుండి ఎకెజి భవన్‌కు తీసుకువచ్చారు. అప్పటికే ఆ ప్రాంతం అంతిమ నివాళులర్పించడానికి వచ్చిన వారితో కిక్కిరిసిపోయింది. ప్రియతమ నేతకు జోహార్లు చెబుతూ వారు చేసిన నినాదాలతో మారుమ్రోగింది. వివిధ దేశాల రాయబారులతోపాటు, పార్టీలు, భావజాలాలకు అతీతంగా పలువురు నేతలు, వివిధ రంగాలకు చెందినవారు తరలివచ్చారు. నేపాల్ మాజీ ప్రధానమంత్రి మాధవ్‌కుమార్ నేపాల్‌తో పాటు, చైనా, రష్యా, వియత్నాం, సిరియా, పాలస్తీనా, క్యూబా దేశాలకు చెందిన రాయబారులు ఏచూరి భౌతిక కాయాన్ని సందర్శించి అంతిమ నివాళు లర్పించారు. మాజీ ఉపరాష్ట్రపతి హమిద్ అన్సారీ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సోనియాగాంధీ, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, మాజీ ముఖ్యమంత్రులు అశోక్ గెహ్లాట్, మాణిక్ సర్కార్, అఖిలేష్ యాదవ్, శరద్‌పవార్, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా, సిపిఐ ఎంఎల్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి జి. దేవరాజన్, ఆర్‌ఎస్‌పి ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, ప్రముఖ చరిత్రకారిణీ రొమిల్లాథాపర్, ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబా తదితరులు ఎకెజి భవన్ వద్ద ఏచూరి భౌతిక కాయానికి నివాళులర్పించారు. ఆయనతో తమకు ఉన్న అనుబంధాన్ని, దేశ ప్రజలకోసం ఆయన చేసిన పోరాటాలను గుర్తుచేసుకున్నారు. అనంతరం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో 'రెడ్‌సెల్యూట్ కామ్రేడ్, సీతారాం ఏచూరి అమర్‌రహే, లాల్‌సలామ్... లాల్‌సలామ్' అన్న నినాదాలతో అంతిమయాత్ర ప్రారంభమైంది. విద్యార్థులు, యువత, కళాకారులు వివిధ భాషలకు చెందిన విప్లవ గీతాలను పాడుతూ రెండు కిలోమీటర్ల మేర సాగిన అంతియమాత్రలో భాగస్వాములయ్యారు. ఏచూరి భౌతిక కాయాన్ని ఉంచిన అంబులెన్స్ ముందు కదలగా, దానిలోనే ఆయన కుటుంబసభ్యులు కూడా ఉన్నారు. అంబులెన్స్ వెనుకే ముందువరసలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, ఆ తరువాత కేంద్ర కమిటీ సభ్యులు నడిచారు. ఆ తరువాత వేలాదిమంది నాయకులు, కార్యకర్తలు, సాధారణ ప్రజలు అంతిమయాత్రలో భాగస్వాములయ్యారు. సాయంత్రం 4.40గంటలకు ఎయిమ్స్‌లోని అనాటమీ విభాగానికి కుటుంబ సభ్యులు, పొలిట్‌బ్యూరో సభ్యులు ఏచూరి భౌతిక కాయాన్ని అప్పగించారు. అక్కడే పది నిమిషాలపాటు చివరిసారి చూసి, కడసారి నివాళులర్పించి కన్నీళ్లతో బయటకు వచ్చేశారు. మార్క్సిస్టు యోధుని మహా ప్రస్థానం ముగిసింది.

మరిన్ని వార్తలు, చిత్రాలు లోపలి పేజీల్లో

కళ్ల ముందే కుళ్లుతున్న పంట

- అప్పులు చేసి పెట్టిన పెట్టుబడులను ఊడ్చేసిన వరద
- దీనావస్థలో కౌలు రైతులు

6

వంట నూనెలు ప్రియం

దిగుమతి సుంకం 20% పెంపు



న్యూఢిల్లీ : ప్రస్తుత పండగ సీజన్‌లో వంట నూనెలు ప్రియం కానున్నాయి. వంట నూనెలపై ప్రాథమిక దిగుమతి సుంకాన్ని కేంద్రప్రభుత్వం 20 శాతం పెంచింది. దేశంలో ఎక్కువగా వాడుతున్న పామాయిల్, సోయానూనె, సన్‌ఫ్లవర్ ఆయిల్ దిగుమతులు తగ్గితే డిమాండ్ పెరిగి వాటి ధరలు పెరిగే అవకాశం ఉంది. దేశీయంగాను ప్రత్యామ్నాయం లేకపోవడంతో దిగుమతి సుంకం పెంచడం ద్వారా వినియోగదారులపై భారం పడనుందని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. పెంచిన దిగుమతి సుంకాలు శనివారం నుంచి అమల్లోకి వచ్చాయి. ప్రపంచంలోనే అత్యధికంగా వంట నూనెలను దిగుమతి చేసుకుంటున్న దేశాల్లో భారత్ టాప్‌లో ఉంది. ప్రతి ఏడాది దేశీయంగా వినియోగించే వంట నూనెల్లో 70 శాతం కంటే ఎక్కువ ఇతర దేశాల నుంచే దిగుమతి చేసుకుంటోంది. ప్రధానంగా అర్జెంటీనా, బ్రెజిల్, రష్యా, ఉక్రెయిన్ నుంచి వంట నూనెలను కొనుగోలు చేస్తోంది. ఇండోనేషియా, మలేషియా, థాయిలాండ్ నుంచి పామాయిల్ దిగుమతి జరుగుతుంది. మొత్తం దిగుమతుల్లో పామాయిల్ వాటా 50 శాతంగా ఉంది.

దేశీయ నూనె గింజల రైతులను ఆదుకునేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. దేశంలో ముడి పామాయిల్, సోయానూనె, సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై అగ్రికల్చర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ సెస్‌ను వసూలు చేస్తుండడంతో గతంలో ఉన్న దిగుమతి సుంకం 5.5 శాతాన్ని 27.5 శాతానికి పెంచినట్లయ్యింది. రిఫైన్డ్ పామాయిల్, సోయా ఆయిల్, సన్‌ఫ్లవర్ ఆయిల్ దిగుమతులపై గతంలో ఉన్న 13.75 శాతం సుంకాన్ని 35.75 శాతానికి చేర్చుతూ కేంద్ర వాణిజ్య మంత్రిత్వశాఖ నోటిఫికేషన్ జారీచేసింది. వచ్చే వారం నుంచి పెరిగిన ధరలు వినియోగదారులపై ప్రభావం చూపవచ్చని న్యూఢిల్లీలోని డీలర్లకు చెందిన గ్లోబల్ ట్రేడ్ హౌజ్ పేర్కొంది.



విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్‌ను ప్రశ్నిస్తున్న స్టీల్ ప్లాంట్ కార్మికులు

కేంద్రం చర్యలకూ.. మీరు చెబుతున్నదానికీ..

పొంతన ఏదీ?

- స్టీల్‌ప్లాంట్ కార్మికుల్లో తీవ్ర ఆందోళన
- టిడిపి అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్ ఎదుట వర్కర్లు
- ప్రయివేటీకరిస్తే పదవికి రాజీనామా చేస్తానన్న పల్లా

ప్రజాశక్తి- ఉక్కునగరం (విశాఖపట్నం)

స్టీల్‌ప్లాంట్ విషయంలో కేంద్రంలోని మోడీ సర్కారు చర్యలకూ, మీరు చెబుతున్న మాటలకూ పొంతన ఉండడం లేదు. ఎన్నికలకు ముందు ఉక్కు పరిరక్షణకు కూటమి నేతలు చెప్పిన మాటకు, ఎన్నికల తర్వాత అందిస్తున్న సహకారానికీ బోలెడు తేడా ఉంది. మేమంతా ఆందోళన చెందుతున్నాం' అని ఉక్కు కార్మికులు... టిడిపి రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ ఎం.శ్రీభరత్‌ను అడిగారు. ప్లాంట్ పరిరక్షణకు చిత్తశుద్ధితో పనిచేయాలని కోరారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలిలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలు శనివారానికి 1,311వ రోజుకు చేరుకున్నాయి. దీక్షల్లో స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. రెండు రోజులుగా వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌పై ఢిల్లీ స్థాయిలో జరుగుతున్న పరిణామాలు, కార్మికుల ఆందోళన నేపథ్యంలో భరోసానిచ్చేందుకు దీక్షా శిబిరం వద్దకు పల్లా శ్రీనివాసరావు, ఎం.శ్రీభరత్ వచ్చారు. శ్రీభరత్ మాట్లాడుతూ ఉక్కు పరిరక్షణ విషయమై కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌తో మాట్లాడామని, ఆ విషయం ఉన్నత స్థాయిలోనిదని ఆమె చెప్పారని తెలిపారు. ప్లాంట్‌కు ప్యాకేజీ ఇవ్వడానికి 10-15 రోజులు పట్టే అవకాశమున్నట్టు తెలియజేశారన్నారు. పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉక్కు కర్మాగారం విషయంలో జరుగుతున్న తాజా పరిణామాల నేపథ్యంలో భరోసానివ్వడానికే తాము ఇక్కడకు వచ్చామన్నారు.

ఆ సమయంలో కార్మికులు కలుగజేసుకుని స్టీల్‌ప్లాంట్ విషయంలో ఎన్నికల ముందు చెప్పిన మాటకు, నేడు కూటమి ప్రభుత్వం అందిస్తున్న సహకారానికి తేడా ఉందని అన్నారు. మిమ్మల్ని, శ్రీభరత్‌ను, గంటా శ్రీనివాసరావును ఉక్కును కాపాడతారనే ఆశతోనే విశాఖ ప్రజలు అత్యధిక మెజార్టీతో గెలిపించారన్నారు. దీనిపై పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణ జరిగే పరిస్థితే వస్తే, తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని, కార్మికులతో కలిసి పోరాడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి విశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి, కార్పొరేటర్లు బొండా జగన్, లేళ్ల కోటేశ్వరరావు, విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ప్రతినిధులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్యరామ్,యు.రామస్వామి, కెఎస్ఎన్.రావు, విళ్లా రామ్మోహన్ కుమార్, దొమ్మేటి అప్పారావు, డివి.రమణారెడ్డి, డి.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథంతోనే పురోగతి

- తిరోగామి శక్తులతో విఘాతం
- జెవివి వార్షిక మహాసభలో సవ్యసాచి ఛటర్జీ



జెవివి వార్షిక మహాసభలో ప్రసంగిస్తున్న సవ్యసాచి ఛటర్జీ

ప్రజాశక్తి- అనంతపురం ప్రతినిధి

శాస్త్రీయ దృక్పథంతోనే మానవ పురోగతి సాధ్యమని ఆల్ ఇండియా పీపుల్స్ సైన్సు నెట్‌వర్క్ (ఎఐపిఎస్ఎన్) మాజీ అధ్యక్షులు ప్రొఫెసర్ సవ్యసాచి ఛటర్జీ పేర్కొన్నారు. అనంతపురంలోని జిఆర్.ఫంక్షన్ హాలులో రెండు రోజులపాటు జరగనున్న జెవివి 17వ వార్షిక మహాసభ శనివారం ప్రారంభమైంది. నగరంలోని జిఆర్.ఫంక్షన్ హాలులో ప్రొఫెసర్ భాగ్యవతి హాలులోని ఆదినారాయణ ప్రాంగణంలో మహాసభను నిర్వహిస్తున్నారు. మహాసభ ప్రారంభం సందర్భంగా సమతా కన్వీనర్ డాక్టర్ ప్రసూన జాతీయ పతాకాన్ని, జన విజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ రంగన్న జెవివి పతాకాన్ని ఆవిష్కరించారు. ముందుగా జన విజ్ఞాన వేదికలో పనిచేసి మరణించిన ప్రొఫెసర్ భాగ్యవతి, లక్ష్మీనారాయణ, ఈశ్వరయ్య తదితరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం జరిగిన సభకు జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్ అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రమణ్యం హాజరై ప్రారంభ సందేశాన్ని ఇచ్చారు.

అనంతరం 'సైంటిఫిక్ టెంపర్-ఛాలంజెస్' అనే అంశంపై ప్రొఫెసర్ సవ్యసాచి ఛటర్జీ మాట్లాడుతూ దేశంలో గూడుకట్టుకున్న అశాస్త్రీయ భావాలకు వ్యతిరేకంగా 1882 నుంచే రాజా రామ్మోహన్ రాయ్ వంటి వారు పనిచేశారని గుర్తు చేశారు. ఆ తర్వాత స్వాతంత్రోద్యమ కాలంలోనూ శాస్త్రీయతపై మరింతగా దృష్టి సారించినట్లు తెలిపారు. ఈ స్ఫూర్తితోనే స్వాతంత్ర్యం అనంతరం కూడా శాస్త్రీయ దృక్పథం ప్రజల్లో పెంపొందించాలని రాజ్యాంగంలో పొందుపరినట్లు వివరించారు. ఇటీవల తిరోగామి శక్తులు ప్రజల్లో శాస్త్రీయ దృక్పథం పెంపుదలకు వ్యతిరేకంగా పని చేస్తుండడం విచారకరమన్నారు. ఈ అవరోధాన్ని అధిగమించే దిశగా సైన్స్ ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయత పెరుగుతున్న కొద్దీ అశాస్త్రీయత కూడా పెరుగుతుండడం ఆందోళన కలిగించే అంశమన్నారు. దేశంలో మూఢనమ్మకాల వ్యతిరేక మిగతా 6లో

ప్రత్యేక ఆకర్షణగా ప్రముఖ హేతువాది రాధాకృష్ణమూర్తి



జెవివి వార్షిక మహాసభలో ప్రముఖ హేతువాది రాధాకృష్ణమూర్తి ప్రత్యేక ఆకర్షగా నిలిచారు. 90 ఏళ్ల వయసులోనూ ఆయన జెవివి వార్షిక మహాసభకు విచ్చేయడం అందరినీ ఆకట్టుకుంది. నడవలేని, మాట్లాడలేని స్థితిలో ఉన్నా, కర్ర పట్టుకుని ఇతరుల సహాయంతో విచ్చేశారు.

వక్ఫ్ బిల్లుపై జెపిసి భేటీ

- 18 నుంచి 3 రోజులపాటు చర్చలు

న్యూఢిల్లీ : వక్ఫ్ (సవరణ) బిల్లుపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ (జెపిసి) ఈనెల 18 నుంచి మూడు రోజులపాటు సంబంధిత వ్యక్తులు, సంస్థలు, వర్గాలతో సమావేశం కానున్నదని అధికారిక వర్గాలు తెలిపాయి. మైనారిటీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధికారులు ఈనెల 18న కమిటీ ముందు ఓరల్ ఎవిడెన్స్‌ను సమర్పించనున్నారు. తర్వాతి రోజు, జెపిసి వివిధ వర్గాలు, నిపుణుల నుంచి అభిప్రాయాలు, ప్రతిపాదనలను వింటుంది. కమిటీకి అభిప్రాయాలు తెలిపే వారిలో పాట్నాలోని చాణక్య నేషనల్ లా యూనివర్సిటీ ఉప సంచాలకులు ప్రొఫెసర్ ఫైజాన్ ముస్తాఫా, పసమంద ముస్లిం మహాజ్, ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్‌లు ఉన్నాయి. 20న ఆలిండియా సజ్జదానశిన్ కౌన్సిల్(అజ్మీర్), ముస్లిం రాష్ట్రీయ మంచ్(ఢిల్లీ), భారత్ ఫస్ట్(ఢిల్లీ) ల నుంచి ఇన్‌పుట్‌లను కమిటీ కోరనున్నది.



అంతిమ యాత్రలో పాల్గొన్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు, నాయకులు, కార్యకర్తలు



ఏచూరి భౌతిక కాయం వద్ద నివాళులర్పిస్తున్న డి రాజా, అన్నీ రాజా తదితరులు

అశ్రునయనాలతో అంతిమయాత్ర



ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

వేలాదిగా తరలివచ్చిన ప్రజానీకపు అశ్రు నయనాల మధ్య సీతారాం ఏచూరి అంతిమయాత్ర సాగింది. గోల్ మార్కెట్‌లోని సిపిఎం కార్యాలయం నుండి శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు అంతిమయాత్ర ప్రారంభమైంది. గురుద్వార్, కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయం, డాక్ భవన్, పటేల్ చౌక్ మెట్రోస్టేషన్ మీదుగా జంతర్ మంతర్ రోడ్డు వరకు సాగింది. దాదాపు రెండు కిలోమీటర్ల మేర సాగిన అంతిమ యాత్రలో ముందు భాగాన రెడ్ షర్ట్ వలంటీర్లు ఏచూరి చిత్ర పటాలు, సిపిఎం జెండాలు చేబూని నినాదాలు చేస్తూ భాగస్వాములయ్యారు.

వారి తరువాత ఏచూరి భౌతిక కాయంతో అంబులెన్స్ కదిలింది. అంబులెన్స్ వెనుక సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, మాణిక్ సర్కార్, బృందాకరత్, బివి రాఘవులు, అశోక్ దావలే, జి రామకృష్ణన్, ఎంఎ బేబి, విజయరాఘవన్, ఎంవి గోవిందన్ మాస్టార్ తదితరులు నడిచారు. కేంద్ర కమిటీ సభ్యులు, వివిధ రాష్ట్రాల నుంచి వచ్చి ప్రతినిధులు, ప్రొఫెసర్లు, విద్యార్థులు, న్యాయవాదులు తదితరులు అంతిమయాత్రలో భాగస్వాములయ్యారు. యాత్ర సాగిన దారిపొడవునా ఉన్న ప్రజలు ఏచూరికి లాల్‌సలాం చెబుతూ నినాదాలు చేశారు. జంతర్ మంతర్ రోడ్డు నుంచి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ ఎస్కార్ట్ నడుమ భౌతిక కాయాన్ని ఎయిమ్స్‌కు తరలించారు.

అంతిమ యాత్రలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, పి మధు, ఎస్ పుణ్యవతి, హేమలత, ఆర్ అరుణ్ కుమార్, వై వెంకటేశ్వరరావు, వి ఉమా మహేశ్వరరావు, వి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, చెరుపల్లి సీతారాములు, బి వెంకట్, ఎస్ వీరయ్య, జూలకంటి రంగారెడ్డి, టి సాగర్, జాన్‌వెస్లీ, డిజి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌లో చివరి చూపులు...

సాయంత్రం 4.40 గంటలకు ఏచూరి కుటుంబ సభ్యులు, సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఏచూరి భౌతిక కాయాన్ని ఎయిమ్స్ అనాటమీ విభాగానికి అప్పగించారు. ఆస్పత్రి అధికారులు భౌతికకాయాన్ని స్వాధీనం చేసుకున్న తరువాత ఆ మేరకు ధృవీకరణ పత్రాన్ని ఏచూరి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగానే అనాటమీ విభాగంలో 10 నిమిషాల పాటు చివరిసారి ఏచూరిని చూడటానికి కుటుంబ సభ్యులకు, అగ్రనేతలకు అవకాశం లభించింది. ఇక్కడే తుది నివాళులర్పించిన అనంతరం వారు ఆ హాలు నుండి బయటకు వచ్చారు. ఆ వెంటనే ఆ విభాగం తలుపులను మూసివేశారు. కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో ఏచూరి ఎయిమ్స్‌లో చేరిన సంగతి తెలిసిందే. అక్కడ చికిత్స తీసుకుంటూనే ఆయన తుదిశ్వాస విడిచారు. అదే ఆస్పత్రికి భావి తరాల వైద్యవిద్యార్థుల పరిశోధనల నిమిత్తం ఆయన భౌతిక కాయం చేరుకుంది.



నివాళులర్పిస్తున్న దీపాంకర్ భట్టాచార్య

కిక్కిరిసిన ఎకెజి భవన్ రోడ్డు

- ఎర్రజెండా, గులాబీ రేకులతో ఏచూరి భౌతిక కాయం
- మారుమోగిన జెఎన్‌యు విద్యార్థుల నినాదాలు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ప్రియతమ నేత సీతారాం ఏచూరిని కడసారి దర్శించుకునేందుకు వచ్చిన వారితో ఎకెజి భవన్ ఉన్న భాయ్ వీర్‌సింగ్ మార్గ్ కిక్కిరిసిపోయింది. కార్మికులు, విద్యార్థులు, మేధావులు, రాజకీయ నాయకులు, జర్నలిస్టులు, ప్రజాప్రతినిధులు తమ అభిమాన నేతకు నివాళులర్పించేందుకు తరలివచ్చారు. మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం శనివారం తగ్గింది. దీంతో ఎకెజి భవన్ ఎదురుగా ఉన్న భారీ వేప చెట్ల కింద నాలుగు టెంట్లు వేశారు. అందులో ఒకదానిలో సీతారాం ఏచూరి భౌతిక కాయం ఉన్న పేటికను ఉంచారు. ఎర్రజెండా కప్పిఉన్న ఆయన భౌతిక కాయాన్ని గులాబీరేకుల మధ్య ఉంచారు. 'హలో కామ్రేడ్.. ఎలా ఉన్నారు?. ఈజ్ ఎవ్రీ థింగ్ గోయింగ్ ఫైన్?' అంటూ ఏచూరి తరచూ అడిగే కుశల ప్రశ్నను చాలామంది గుర్తుచేసుకోవడం కనిపించింది. ప్రదర్శనగా అక్కడకు వచ్చిన జెఎన్‌యు విద్యార్థులు ఆ ప్రాంతం మారుమోగే విధంగా నినాదాలు చేశారు. 'సీతారాం అమర్‌రహే... 'నీలోనూ, నాలోనూ ఏచూరి సజీవం " అంటూ వారు చేసిన నినాదాలు అక్కడ హోరెత్తించాయి. జెఎన్‌యు రోజుల్లో సీతారాంతో అనుబంధం ఉన్న పలువురు తమ విషాదాన్ని ఏమాత్రం దాచుకోలేకపోయారు. ప్రఖ్యాత చరిత్రకారిణి రోమిలాథాపర్ శ్రద్ధాంజలి ఘటించి ఏచూరి భార్య సీమచిస్తీని కౌగిలించుకుని ఓదార్చారు. ప్రొఫెసర్ జిఎన్ సాయిబాబా చక్రాల కుర్చీలో వచ్చి నివాళి అర్పించారు. ఏచూరి సిబ్బంది, సెక్యూరిటీ కూడా ఆయనకు వీడ్కోలు పలికారు. సమయం మధ్యాహ్నం మూడు దాటడంతో పొలిట్‌బ్యూరో సభ్యులు, కుటుంబ సభ్యులు అంతిమ నివాళులర్పించేందుకు రావాల్సిందిగా ప్రకటన వెలువడింది. ఆ తరువాత కొద్ది సేపటికి అంతిమయాత్ర ప్రారంభమైంది. వేలాదిమంది ప్రజలు ఏచూరి ఫొటోలతో కూడిన ప్లకార్డులు, బ్యానర్లను ప్రదర్శించారు. కేరళ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్, హర్యానా, పంజాబ్, రాజస్థాన్ తదితర రాష్ట్రాల కార్యకర్తలు తమ ప్రియతమ నేతకు నివాళులర్పించేందుకు తరలివచ్చారు.




నివాళులర్పిస్తున్న సిపిఎం పార్లమెంటరీ పార్టీ నేతలు

ఎకెజి భవన్ వద్ద ఉద్వేగభరితం

ప్రజాశక్తి -న్యూఢిల్లీ బ్యూరో

సీతారాం ఏచూరి అంతిమయాత్ర సందర్భంగా సిపిఎం కేంద్ర కార్యాలయం ఎకెజి భవన్ వద్ద శనివారం ఉదయం నుండి ఉద్వేగభరిత వాతావరణం నెలకొంది. ఏచూరి మరణవార్త తెలియడంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుండి సిపిఎం శ్రేణులు, వామపక్ష అభిమానులు శుక్రవారం రాత్రికే ఎకెజి భవన్ వద్దకు చేరుకున్నారు. శనివారం ఉదయం ఉదయం 10 గంటల ప్రాంతంలో సౌత్ వెస్ట్ ఢిల్లీలోని వసంత్‌కుంజ్‌లోని ఆయన నివాసం నుంచి అంబులెన్స్‌లో ఏచూరి భౌతిక కాయాన్ని ఎకెజి భవన్‌కు తీసుకొచ్చారు. ఏచూరి భార్య సీమా చిస్తీ, కుమార్తె అఖిల, కుమారుడు డానిష్, సోదరుడు శంకర్ తదితరులు భౌతికకాయంతో పాటు వచ్చారు. ఆ సమయంలో 'సీతారాం అమర్‌రహే' అన్న నినాదాలు మారుమోగాయి. ఎకెజి భవన్ ఆవరణలో ప్రత్యేకంగా సిద్ధం చేసిన స్థలంలో ప్రజల సందర్శనార్థం ఏచూరి భౌతిక కాయాన్ని ఉంచారు. తొలుత పొలిట్‌బ్యూరో సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రకాష్ కరత్, కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్, మాణిక్ సర్కార్, బృందాకరత్, బివి రాఘవులు, నిలోత్పల్ బసు, ఎంఎ బేబిలు తొలుత నివాళులర్పించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కేరళ, పశ్చిమ బెంగాల్, త్రిపుర, తమిళనాడు, హిమాచల్ ప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మహారాష్ట్ర సహ వివిధ రాష్ట్ర కమిటీల ప్రతినిధులు నివాళులర్పించారు. ఆ తరువాత ప్రియతమ నేతకు నివాళులు అర్పించేందుకు తరలివచ్చిన విద్యార్థులు, కార్మికులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, గృహిణులు, వివిధ రాజకీయ పార్టీల నేతలు, సామాజిక సంఘాల కార్యకర్తలు, రచయితలు, చరిత్రకారులు ఇలా వివిధ తరగతులకు చెందిన వారు ఒకరి తరువాత ఒకరుగా ప్రియతమ నేతను కడసారి 'రెడ్ సెల్యూట్' చెప్పారు.



ఏచూరి కుమార్తె అఖిల



ఇంద్రాణి మజుందార్

జాతీయ, అంతర్జాతీయ నేతల ఘన నివాళి

- జ్ఞాపకాలను పంచుకున్న విదేశీ ప్రతినిధులు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి పలువురు జాతీయ, అంతర్జాతీయ నేతలు ఘన నివాళి అర్పించారు. శనివారం ఉదయమే ఎకెజి భవన్‌కు చేరుకున్న వీరు ఏచూరి భౌతికకాయంపై పుష్పగుచ్ఛాలు ఉంచి అంతిమ నివాళులర్పించారు. నేపాల్ మాజీ ప్రధానమంత్రి మాధవ్ కుమార్ నేపాల్, భారత్‌లో చైనా రాయబారి ఝూ హైహాంగ్, రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్, వియత్నాం రాయబారి గుయెన్ థాన్ హై, సిరియా రాయబారి డాక్టర్ బాసిమ్ అల్ ఖతీబ్, పాలస్తీనా రాయబారి అద్నాన్ అబు అల్హయ్జా, క్యూబా రాయబారి (చార్జ్ డి ఎఫైర్స్) అబెల్ అబెల్లె డెస్పాయిగ్నే తదితరులు ఏచూరికి చివరి నివాళులు అర్పించిన తర్వాత సందర్శకుల డైరీలో తమ జ్ఞాపకాలను పంచుకున్నారు

తరలివచ్చిన జాతీయ నేతలు .. ప్రముఖులు

అంతిమ నివాళులర్పించేందుకు పలువురు జాతీయ నేతలతోపాటు వివిధ రంగాలకు చెందిన సామాజిక ప్రముఖులు ఎకెజి భవన్‌కు చేరుకున్నారు. కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, అశోక్ గెహ్లాట్, పి చిదంబరం, జైరాం రమేష్, రాజీవ్ శుక్లా, సచిన్ పైలట్, మణిశంకర్ అయ్యర్, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, ఎన్‌సిపి అధ్యక్షుడు శరద్ పవార్, మాజీ ఉపరాష్ట్రపతి హమీద్ అన్సారీ, సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేష్ యాదవ్, డిఎంకె నేతలు ఉదయనిధి స్టాలిన్, దయానిధి మారన్, టిఆర్ బాలు, కనిమొళి, మహారాష్ట్ర ప్రతిపక్ష నేత విజయ్ వడేటివార్, ప్రబీర్ పుర్కాయస్థ, ఆప్ నేతలు మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్, రాఘవ్ చద్దా, గోపాల్ రాయ్, ఆర్‌జెడి నేత మనోజ్ కుమార్ ఝూ, సిపిఐ ఎంఎల్ ప్రధాన కార్యదర్శి దీపాంకర్ భట్టాచార్య, ఫార్వర్డ్ బ్లాక్ ప్రధాన కార్యదర్శి జి. దేవరాజన్, ఆర్‌ఎస్‌పి ప్రధాన కార్యదర్శి మనోజ్ భట్టాచార్య, కేరళ కాంగ్రెస్ నాయకుడు జోస్ కె మణి, లోక్‌సభ మాజీ సెక్రటరీ జనరల్ పిడిటి ఆచారి, మాజీ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ వజాహత్ హబీబుల్లా, చరిత్రకారిణి రొమిలా థాపర్, ప్రొఫెసర్ జి.ఎన్ సాయిబాబా, స్వరాజ్ అభియాన్ యోగేంద్ర యాదవ్, సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్, ఏచూరి మాజీ భార్య ఇంద్రాణి మజుందార్, వివిధ దేశాల రాయబారులు వచ్చి నివాళులర్పించారు. ముస్లిం లీగ్ ఎంపిలు పికె కున్హాలికుట్టి, ఇటి మహ్మద్ బషీర్, హారిస్ బీరాన్, సిపిఐ ఎంపిలు పి సంతోష్ కుమార్, పిపి సునీర్, మహిళా ఫెడరేషన్ నేషనల్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి అన్నీ రాజా, ఐఎన్‌ఎల్ ప్రధాన కార్యదర్శి సులైమాన్ సేథ్, ఢిల్లీ ఆర్చ్ బిషప్ అనిల్ కుటో, శాంతిగిరి ఆశ్రమ ప్రధాన కార్యదర్శి స్వామి గురురత్నం జ్ఞాన తపస్వీ, జమాత్ ఇస్లామీ అమీర్ టి ఆరిఫ్ అలీ, ప్రొఫెసర్ కెవి థామస్, కేంద్ర మాజీ మంత్రి సురేష్ ప్రభు కూడా నివాళులర్పించారు.

ప్రజాసంఘాల నివాళి

సిఐటియు అఖిల భారత అధ్యక్షురాలు కె హేమలత, ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి విజూ కృష్ణన్, ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి వెంకట్, ఐద్వా ప్రధాన కార్యదర్శి మరియం దావలే, కోశాధికారి ఎస్.పుణ్యవతి, డివైఎఫ్ఐ ప్రధాన కార్యదర్శి హిమగ్నా భట్టాచార్య, కేంద్ర కార్యదర్శివర్గ సభ్యుడు జెక్ సి థామస్, ఎస్ఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షులు విపి సాను, ప్రధాన కార్యదర్శి మయూఖ్ బిశ్వాస్ పుష్పగుచ్ఛాలుంచి, నివాళులర్పించారు. సహమత్, జననాట్య మంచ్, జనసంస్కృతి, వరల్డ్ మలయాళీ అసోసియేషన్ కార్యకర్తలు నివాళులర్పించారు.



ఆర్‌జెడి ఎంపి మనోజ్ ఝూ



కాంగ్రెస్ నేత సచిన్ పైలెట్

సిపిఎం నేతలు ఇలా...

పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాష్ కరత్, పినరయి విజయన్, బృందాకరత్, మాణిక్ సర్కార్, బివి రాఘవులు, ఎంఎ బేబీ, సుభాషిణి అలీ, మహమ్మద్ సలీం, అశోక్ ధావలే, రామచంద్రదోమ్, తపన్‌సేన్, జి రామకృష్ణన్, నీలోత్పల్ బసు, ఎ విజయరాఘవన్, ఎంవి గోవిందన్‌లు నివాళులర్పించారు. సీనియర్ నేతలు బిమన్ బోస్, హనన్ మొల్లా, పి కరుణాకరన్, కేరళ నుంచి కేంద్ర కమిటీ సభ్యులు ఇపి జయరాజన్, టిఎం థామస్ ఐజాక్, పికె శ్రీమతి, కెకె శైలజ తదితరులు కూడా వచ్చారు. కేరళ రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి పినరయి విజయన్ పూలమాల వేసి నివాళులర్పించారు. సిపిఎం ఎంపిలు కె.రాధాకృష్ణన్, అమ్రారామ్, ఎస్.వెంకటేశన్, సచ్చితానందం, జాన్ బ్రిటాస్, వి.శివదాసన్, ఎఎ.రహిమ్ పుష్పగుచ్ఛాలు ఉంచారు. కేరళ మంత్రులు కెఎన్ బాలగోపాల్, పి రాజీవ్, సాజి చెరియన్, మహ్మద్ రియాజ్, ఎంబి రాజేష్, విఎన్ వాసవన్, ఆర్ బిందు, రామచంద్రన్ కదనపల్లి, స్పీకర్ ఎఎన్ షంషీర్ తదితరులు నివాళులర్పించారు. సీనియర్ నేత విఎస్ అచ్యుతానందన్ తరపున ఆయన కుమారుడు విఎ అరుణ్‌కుమార్ పుష్పగుచ్ఛం అందించారు.

తెలుగు రాష్ట్రాల నుండి

సీతారాం ఏచూరికి తెలుగు రాష్ట్రాలకు చెందిన వివిధ రాజకీయ పార్టీల నేతలు, సామాజిక కార్యకర్తలు నివాళి అర్పించారు. వైసిపి ఎంపి విజయ సాయిరెడ్డి, బిఆర్‌ఎస్ ఎంపి కెఆర్ సురేష్ రెడ్డి, కాంగ్రెస్ నేతలు జెడి శీలం, చింతా మోహన్, సామాజిక కార్యకర్త బెజవాడ విల్సన్, ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ తదితరులు నివాళులర్పించారు.

విదేశీ ప్రముఖుల సంతాపం ...

రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ భారత్-రష్యా స్నేహబంధాన్ని బలోపేతం చేసేందుకు సీతారాం ఏచూరి విశేష కృషి చేశారని పేర్కొన్నారు. దశాబ్దాలుగా ఏచూరి వ్యక్తిగతంగా సన్నిహితుడని, ఆయన అకాల నిష్క్రమణ తీరని లోటు అని డెనిస్ అలిపోవ్ తెలిపారు. నియంతృత్వానికి వ్యతిరేకంగా నేపాలీ ప్రజలు చేస్తున్న పోరాటాలకు గొప్ప మద్దతునిచ్చిన నాయకుడు ఏచూరి అని మాధవ్ కుమార్ నేపాల్ విజిటర్స్ డైరీలో రాశారు. సిరియా రాయబారి బాసిమ్ అల్ ఖతీబ్ ఏచూరి సిరియాకు శ్రేయోభిలాషి, సన్నిహిత మిత్రుడని పేర్కొన్నారు. తన సిద్ధాంత వైఖరిని ఆయుధంగా చేసుకుని బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన నాయకుడని, అలాంటి సోదరుడిని పోగొట్టుకున్నప్పుడు జీవితం కష్టమనే వాస్తవికత వెల్లడవుతుందని తెలిపారు. చైనా ప్రజలకు అత్యంత ఆప్తమిత్రుడు ఏచూరి అకాల మరణం పట్ల చైనా రాయబారి ఝూ హేహాంగ్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. భారత్-చైనా సంబంధాలను బలోపేతం చేసేందుకు ఏచూరి అందించిన అమూల్యమైన కృషి ఎప్పటికీ గుర్తుండిపోతుందని తెలిపారు.



నివాళులర్పిస్తున్న సిరియా, రష్యా నేతలు



నినదిస్తున్న జెఎన్‌యు విద్యార్థులు



ఏచూరి వ్యక్తిగత సిబ్బంది

వరద బాధితులకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విజయవాడలో ఇటీవల సంభవించిన వరదలకు తీవ్రంగా నష్టపోయిన బాధితులకు రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యాన శనివారం దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర నాయకులు దయా రమాదేవి, రైల్వే కాంట్రాక్టు వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి వివిఎల్ నరసింహారావు, సిఐటియు నాయకులు ఐవి నారాయణ, వై.అలివేలు పాల్గొన్నారు.

పోర్ట్ బ్లెయిర్ పేరు మార్పును స్వాగతిస్తున్నా : పవన్‌కల్యాణ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అండమాన్ నికోబార్ దీవుల రాజధాని పోర్ట్‌బ్లెయిర్‌ను "శ్రీ విజయపురం"గా మార్చాలన్న కేంద్రప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ట్విట్టర్‌లో పోస్ట్ చేశారు. పాశ్చాత్య దేశాల బానిసత్వ మూలాలకు, వలసవాద పాలనకు గుర్తుగా ఉన్న పేరును తీసేయడం భావితరాలపై వలసవాద విధానాల ప్రభావం పడకుండా ఉండటానికి ఉపయోగపడుతుందని భావిస్తున్నట్లు తెలిపారు.



బోట్‌ను కట్ చేస్తున్న బృందం సభ్యులు

కొనసాగుతున్న బోట్ల తొలగింపు ప్రక్రియ

ప్రజాశక్తి - వన్‌టౌన్ (విజయవాడ) : విజయవాడ ప్రకాశం బ్యారేజీని ఢీకొన్న మూడు బోట్ల తొలగింపు ప్రక్రియ విస్తృతంగా కొనసాగుతోంది. విశాఖపట్నం నుంచి పదిమందితో కూడిన 'సీ లయన్' డైవింగ్ టీమ్ వచ్చినా ఫలితం లేకపోవడంతో కాకినాడ నుంచి మరో పదిమందితో కూడిన స్పెషల్ టీమ్‌ను కూడా ప్రభుత్వం రంగంలోకి దింపింది. బోట్లను కలిపి ఉన్న చిక్కుముడిని విడదీయగలిగారు. ఈ రెండు బృందాల సంయుక్త ఆధ్వర్యాన ఓ బోటును క్రేన్, రోప్‌ల సాయంతో కొంతమేర పక్కకు జరిపారు. బ్యారేజీ నుంచి 200 మీటర్ల దూరం వరకు బోట్లను ప్రొక్లెయినర్‌తో లాగేందుకు చర్యలు చేపట్టారు. బోట్లకు గొలుసులు కట్టి బ్యారేజీ నుంచి లాగాలని ప్రయత్నిస్తున్నట్లు అధికారులు తెలిపారు. మరోపక్క బొట్లను కట్‌చేసే పనిని కూడా కొనసాగిస్తున్నారు. వీటి తొలగింపు ప్రక్రియ మరికొన్ని రోజులు పట్టే అవకాశం ఉందని జలవనరుల శాఖ అధికారులు తెలిపారు.

తెలుగుజాతి గర్వించదగ్గ రచయిత్రి మొల్ల

- మంత్రి కొల్లు రవీంద్ర
- తుమ్మలపల్లి కళాక్షేత్రంలో విగ్రహావిష్కరణ



మొల్ల విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న కృష్ణదత్త చామరాజ వడియార్

ప్రజాశక్తి - విజయవాడ : మహా కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ (మొల్ల) తెలుగు జాతి గర్వించే రచయిత్రి అని రాష్ట్ర ఎక్సైజ్, గనులు, భూగర్భశాస్త్ర శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఆమె తొలి తెలుగు కవయిత్రి అని కొనియాడారు. విజయవాడలో తుమ్మలపల్లి కళాక్షేత్రంలో మొల్ల కాంస్య విగ్రహాన్ని మైసూర్ మహారాజా, ఎంపి, యదువీర కృష్ణదత్త చామరాజ వడియార్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కళాక్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. తెలుగు జాతికి విలువైన రత్నం మొల్ల అని కొనియాడారు. నన్నయ్య ఆదికవి అయితే, ఆది కవయిత్రి మొల్ల అని కీర్తించారు. తెలుగు సాహిత్య చరిత్రలో ఆమెకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. రామాయణాన్ని అచ్చ తెలుగులో సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో అనువదించిన గుర్తుచేశారు. మొల్లను ఆదర్శంగా తీసుకుని బాలికలు ఉన్నత చదువులు చదవాలని ఆకాంక్షించారు. బాలికల చదువు దేశానికే వెలుగని పేర్కొన్నారు. చామరాజ వడియార్ మాట్లాడుతూ.. ఎన్నో శతాబ్దాల నుంచి కన్నడ, ఆంధ్ర రాష్ట్రాలకు సన్నిహిత సంబంధాలు ఉన్నాయని గుర్తుచేశారు. తెలుగు కవయిత్రి మొల్ల ఒక ధీరవనిత అని కొనియాడారు. నాటి కాలంలో రాజాస్థానాల అండ లేకుండా ఒక కావ్యం రాయలేరని, కానీ మొల్ల ఏ రాజాస్థానం అండ లేకుండా అచ్చతెలుగులో రామాయణం రచించారని కొనియాడారు. శ్రీ కృష్ణదేవరాయల కాలం నుంచి రెండు రాష్ట్రాల మధ్య మంచి మైత్రి కొనసాగుతోందన్నారు. మైసూర్ ఆస్థానంలో ఎందరో తెలుగు వారు వివిధ పదవులు అలంకరించారని గుర్తు చేసుకున్నారు. మోక్షగుండం విశ్వేశ్వరయ్య తెలుగు సంతతి వారని, ఆయన గురించి తెలియని భారతీయుడు ఉండడని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు కెవిఎస్. లక్ష్మణరావు, దువ్వారపు రామారావు ఎమ్మెల్యేలు మండలి బుద్ధ ప్రసాద్, గద్దె రామమోహనరావు, యార్లగడ్డ వెంకట్రావ్, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య, కమ్మరి శాలివాహన సంఘ ప్రముఖులు ప్రసంగించారు. అనంతరం మంత్రి కొల్లు రవీంద్ర, అతిథులను సత్కరించారు.

ముగ్గురు గంజాయి విక్రేతలు అరెస్ట్

- మరో ఇరువురు పరార్

ప్రజాశక్తి-తెనాలి (గుంటూరు జిల్లా)

గుంటూరు జిల్లా తెనాలిలో ముగ్గురు గంజాయి విక్రేతలను పోలీసులు అరెస్ట్ చేశారు. వారి నుంచి కేజీన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. స్థానిక త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో శనివారం డిఎస్‌పి బి.జనార్థనరావు వెల్లడించిన వివరాల మేరకు.. తెనాలి మండలం చినపరిమి రోడ్డులో ఐదుగురు వ్యక్తులు గంజాయితో ఉన్నట్లు త్రీటౌన్ సిఐ ఎస్ రమేష్‌బాబుకు అందిన సమాచారంతో ఆయన తన సిబ్బందితో అక్కడికి వెళ్లారు. ఐతానగర్‌కు చెందిన రావుత్ సల్మాన్ అలియాస్ కట్రాజు, రజకచెరువు ప్రాంతానికి చెందిన మునిపల్లి సుబ్బారావు అలియాస్ బుల్లి, మారీస్‌పేటకు చెందిన కోళ్ళ మహేష్ అలియాస్ మల్లిని అరెస్ట్ చేసి వారి నుంచి కేజీన్నర గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులను చూసి ఇద్దరు పరారయ్యారు. కేజీన్నర గంజాయిని రూ.30 వేలకు అరకు ప్రాంతంలో రావుస్ సల్మాన్, ప్రభాస్ కొనుగోలు చేసి, చిన్న ప్యాకెట్లుగా చేసి ఇక్కడ విక్రయిస్తున్నారు. పరారైన నిందితులను త్వరలోనే పట్టుకుంటామని డిఎస్‌పి తెలిపారు.

గుజరాత్‌లో నీట మునిగి 8మంది మృతి

గుజరాత్: గుజరాత్‌లోని దేగాం తాలూకాలో జరిగిన వినాయక నిమజ్జనంలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఒకే గ్రామానికి చెందిన ఎనిమిది మంది యువకులు నీటిలో మునిగి చనిపోయారు. వస్నా సోగ్తికి చెందిన కొందరు యువకులు గణేషుడిని నిమజ్జనం చేసేందుకు మాషో నదికి వెళ్లారు. నిమజ్జనం అనంతరం ఓ యువకుడు ఈత కొడుతూ మునిగిపోయాడు. అతడిని కాపాడేందుకు ఒకరి తర్వాత మరొకరు నీటిలో దూకి మునిగిపోయారు. దీనిపై ప్రధాని నరేంద్ర మోడీ సంతాపం తెలిపారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ కానివ్వొద్దు

- ప్రధానితో సిఎం మాట్లాడాలి
- ఐరన్‌ఓర్ కేటాయించాలి : మాజీమంత్రి వడ్డే

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణ కాకుండా ఆపే విధంగా ప్రధాని మోడీతో సిఎం చంద్రబాబునాయుడు మాట్లాడాలని, ఒరిశాలోని రాయదుర్గం నుంచి ఐరన్‌ఓర్ విశాఖ స్టీల్‌కు వచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి ఒప్పించాలని రైతు సంఘాల సమన్వయ సమితి రాష్ట్ర కన్వీనరు వడ్డే శోభనాద్రీశ్వరరావు కోరారు. విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నర్సింగరావుతో కలిసి మీడియాతో మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్ ప్రస్తుతం గడ్డు పరిస్థితుల్లో ఉందని, ఇప్పటికే రెండు ప్లాంట్లు మూత వేయగా, తాజాగా మూడో ప్లాంట్‌లో కూడా ఉత్పత్తి ఆగిపోయే ప్రమాదకర పరిస్థితి వచ్చిందని అన్నారు. రుణ భారం చూపి ప్లాంటును అమ్మేందుకు కేంద్రం చూస్తోందని విమర్శించారు. టాటా స్టీల్ కన్నా ఎక్కువ విలువ కలదని, కేంద్ర రాష్ట్రాల ఖజానాకు రూ.58 వేలకోట్లు గతంలో చెల్లించిందని తెలిపారు. ప్రస్తుతం రూ.17,500 కోట్లు మాత్రమే బ్యాంక్ రుణాలు ఉన్నాయని, అవి కూడా కేంద్రం క్యాప్టివ్ మైన్స్ కేటాయించకపోవడం వల్ల అప్పులు అయ్యాయని పేర్కొన్నారు. ఐరన్‌ఓర్, బొగ్గు గనులు కేటాయిస్తే రెండు, మూడు సంవత్సరాల్లో అప్పులు తీరి లాభాల బాట పట్టే పరిస్థితి వస్తుందని వడ్డే శోభనాద్రీశ్వరరావు తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఉన్న 22 వేల ఎకరాల భూమిని కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలని కేంద్రప్రభుత్వం చూస్తోందన్నారు. భూమి విలువ రూ.2 లక్షల కోట్లు ఉంటుందని, కార్పొరేట్లకు రూ.25 వేల కోట్లకే అమ్మివేయాలని చూస్తోందని విమర్శించారు. చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విశాఖ స్టీల్ ప్రైవేటీకరణ కాకుండా ఆపాలని, ఉద్యమానికి సంఘీభావం కూడా తెలిపారని వడ్డే గుర్తు చేశారు. ఈనెల 16న గుజరాత్‌లో జరిగే సమ్మిట్‌కు ప్రధాని మోడీతో పాటు చంద్రబాబు హాజరవుతున్న నేపథ్యంలో విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ కాకుండా ఆపాలని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో రిటైర్డ్ ఐఎఎస్ బండ్ల శ్రీనివాస్, ఎస్ఆర్ఆర్ కాలేజి రిటైర్డ్ ప్రిన్సిపాల్ లక్ష్మణరావు పాల్గొన్నారు.

వర్షంతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- వ్యవసాయ శాఖ రాష్ట్ర కమిషనర్‌కు ఎపి రైతు సంఘం వినతి

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు జిల్లా ఆదోని మార్కెట్ యార్డులో గత నెలలో కురిసిన భారీ వర్షానికి నష్టపోయిన వేరుశనగ రైతులను వెంటనే ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాని ఎపి రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రభాకర్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో వ్యవసాయశాఖ రాష్ట్ర కమిషనర్ కార్యాలయంలో కమిషనర్ ఢిల్లీరావుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరుగాలం శ్రమించి పండించిన వేరుశనగ పంటను విక్రయించేందుకు ఆగస్టు 17న ఆదోని మార్కెట్ యార్డ్‌కు అన్నదాతలు తీసుకువచ్చారని, ఆ రోజు కురిసిన భారీ వర్షానికి యార్డ్‌లోని సుమారు 5000 బస్తాలు నీటిపాలయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని అదనుగా భావించిన వ్యాపారస్తులు 30 కేజీల బస్తాకు ఐదు కేజీల తరుగును తీసుకున్నారని వివరించారు. రైతుల నష్టాన్ని మార్కెట్ యార్డు భరించాలని, రైతుకు నష్టం లేకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. విజ్ఞాపన పత్రాన్ని మార్కెటింగ్ ముఖ్య కార్యదర్శికి పంపి రైతులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకుంటానని కమిషనర్ ఢిల్లీరావు హామీ ఇచ్చారు.



ఢిల్లీరావుకు సమస్యను వివరిస్తున్న ప్రభాకర్‌రెడ్డి, రామకృష్ణ

నవంబర్‌లో గ్లోబల్ కోఆపరేటివ్ కాన్ఫరెన్స్

- ఇఫ్కో లిమిటెడ్ నిర్వహణ

న్యూఢిల్లీ : ఇంటర్నేషనల్ కోఆపరేటివ్ అలయన్స్ (ఐసిఎ), కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ సహకారంతో ఐసిఎ జనరల్ అసెంబ్లీ గ్లోబల్ కోఆపరేటివ్ కాన్ఫరెన్స్ 2024ను నిర్వహించనున్నట్లు ఇఫ్కో లిమిటెడ్ తెలిపింది. దీన్ని న్యూఢిల్లీలోని భారత్ మండపంలో 2024 నవంబర్ 25 నుండి 30 వరకు ఏర్పాటు చేస్తున్నట్లు ఐసిఐ డిజి జెరోయెన్ డగ్లస్ మీడియాకు తెలిపారు. 130 ఏళ్ల చరిత్ర కలిగిన ఐసిఎ తొలిసారి భారత్ గ్లోబల్ కోఆపరేటివ్ కాన్ఫరెన్స్, జనరల్ అసెంబ్లీ నిర్వహణకు ముందుకు వచ్చిందన్నారు. ఇంతక్రితం 2023లో బ్రసెల్స్‌లో జరిగిన ఐసిఎ బోర్డు సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. 'సహకార సంఘాలు అందరి శ్రేయస్సును పెంపొందిస్తాయి' అనే ప్రధాన అంశంతో ఈ కార్యక్రమం జరగనుందన్నారు.

జూన్ కల్లా విజయవాడ విమానాశ్రయ విస్తరణ

- కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు



విస్తరణ పనులపై సమీక్ష చేస్తున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

ప్రజాశక్తి - గన్నవరం (విజయవాడ)

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయ విస్తరణ పనులు వేగవంతం చేసి పూర్తి చేయాలని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అధికారులను ఆదేశించారు. కృష్ణా జిల్లా గన్నవరం విమానాశ్రయం విశిష్ట అతిథుల భవనంలోని కాన్ఫరెన్స్ హాల్లో రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి, అనకాపల్లి ఎంపి సిఎం రమేష్, గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు యార్లగడ్డ వెంకట్రావు, సాధారణ పరిపాలన విభాగం ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్, జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, ఇతర అధికారులతో కలిసి విజయవాడ విమానాశ్రయ విస్తరణ అభివృద్ధి పనుల పురోగతిపై ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ విజయవాడ విమానాశ్రయ అభివృద్ధి పనులు అత్యంత ప్రాధాన్యత కింద చేపడుతున్నామన్నారు. జూన్ 2025 నాటికి అన్ని పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని, ఆ దిశగా అధికారులు కృషి చేయాలని సూచించారు.

ఇప్పటి వరకు 52 శాతం మాత్రమే పనులు పూర్తి చేయడం పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. నిధులు, మెటీరియల్ కొరత లేదని, అయినప్పటికీ ఆలస్యానికి కారణాలపై ఆరా తీశారు. ఎడతెరపి లేకుండా కురిసిన వర్షాల కారణంగా పనులు కొంతమేర మందగించాయని, వేగవంతం చేసి నిర్దేశిత సమయానికి పనులను పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. విజయవాడ విమానాశ్రయ విస్తరణలో భాగంగా నెలకొన్న భూ సమస్యలు, కోర్టు వివాదాలు, ఏలూరు కాల్వపై వంతెన నిర్మాణం, రైతులకు పరిహారం చెల్లింపు వంటి సమస్యల పరిష్కారానికి కషి చేయాలని అధికారులకు కేంద్ర మంత్రి సూచించారు. ఈ సమావేశంలో గన్నవరం విమానాశ్రయ జనరల్ మేనేజర్ రామాచారి, డైరెక్టర్ లక్ష్మీ కాంత్ రెడ్డి, గన్నవరం మండలం తహసీల్దార్ శివయ్య తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న ఎస్ఎస్ఎ రాష్ట్ర జెఎసి ఛైర్మన్ కాంతారావు

సమగ్ర శిక్ష ఉద్యోగులకు
ఉద్యోగ భద్రత కల్పించాలి

- ఎస్ఎస్ఎ రాష్ట్ర జెఎసి ఛైర్మన్ కాంతారావు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

సమగ్ర శిక్ష ఉద్యోగులకు రెగ్యులర్, హెచ్ఆర్ పాలసీ, సమాన పనికి సమాన వేతనం ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పించాలని ఎస్ఎస్ఎ రాష్ట్ర జెఎసి ఛైర్మన్ కాంతారావు డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా కార్మిక కర్షక భవన్‌లో శనివారం జిల్లా కన్వీనర్ రంగన్నగౌడ్ అధ్యక్షతన సమగ్ర శిక్ష ఉద్యోగుల హక్కుల సాధన రాయలసీమ ప్రాంతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంతారావు మాట్లాడుతూ రెగ్యులర్ హెచ్ఆర్ పాలసీ మినిమం టైం స్కేల్, ఉద్యోగ భద్రత, జీతాలు ఒకటవ తారీఖున వచ్చేటట్లు రాష్ట్ర సంచాలకులు వార్షిక బడ్జెట్ విడుదల చేయాలని కోరారు. సమగ్ర శిక్షలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలన్నారు. ప్రస్తుతం ఉన్న పార్ట్ టైం విధానాన్ని రద్దుచేసి ఫుల్‌టైమ్ స్కేల్ విధానాన్ని అమలు చేయాలని, హెచ్ఆర్ఎ, డిఎ అమలు చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. రూ.పది లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్, గ్రాట్యూటీ కల్పించాలని కోరారు. సామాజిక భద్రత పథకాలు ఇపిఎఫ్, ఇఎస్ఐ అమలు చేయాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ మంజూరు చేయాలని, పని భారం తగ్గించేందుకు ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి జాబ్ ఛార్ట్ ఇవ్వాలన్నారు. అన్ని సంక్షేమ పథకాలూ అమలు చేసి ఎక్స్‌గ్రేషియా రూ.20 లక్షలు పెంచాలని, మరణించిన ఉద్యోగుల కుటుంబాలను ఆదుకునేందుకు కారుణ్య నియామకాలు చేపట్టాలని కోరారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవులు మంజూరు చేయాలని అన్నారు. జెఎసి సభ్యులందరూ ఐక్యమత్యంగా ఉండి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. సర్వ శిక్ష అభియాన్ రాష్ట్ర సహాధ్యక్షులు మహమ్మద్ రఫీ, సిఐటియు కర్నూలు జిల్లా కార్యదర్శి జె నాగేశ్వరరావు, నంద్యాల జిల్లా నాయకులు ఎ నాగరాజు, ఎస్ఎస్ఎ జిల్లా అధ్యక్షులు రాజు, జిల్లా సలహాదారు బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి రంగన్న జిల్లా కోశాధికారి జగదీష్ , జెఎసి నాయకులు శాంతి, నాగరత్నమ్మ, సమగ్ర శిక్ష ఉద్యోగులు పాల్గొన్నారు.

పువర్తి బేస్ క్యాంపుపై మావోయిస్టుల మెరుపు దాడి

- ప్రతి దాడి చేసిన పోలీస్ బలగాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లా జేగురుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలో గల పువర్తి బేస్ క్యాంపుపై శుక్రవారం అర్ధరాత్రి మావోయిస్టులు దేసవాలి రాకెట్ లాంచర్లు బిజిఎల్‌తో మెరుపు దాడి చేశారు. ఇందుకు సంబంధించి సుకుమా ఎస్‌పి కిరణ్ చౌహాన్ తెలిపిన వివరాల ప్రకారం.. మావోయిస్టు పార్టీ మోస్ట్ వాంటెడ్, పిఎల్‌జిఎ బెటాలియన్ కమాండర్ హిడ్మా స్వగ్రామమైన పువర్తిలో నిర్మించిన బేస్ క్యాంపుపై మావోయిస్టులు ఒక్కసారిగా మెరుపు దాడి చేశారు. బిజిఎల్‌తో 15 నుంచి 20 రౌండ్లు దాడి చేయడంతో ఆత్మరక్షణ కోసం పోలీసులు సైతం దీటుగా కాల్పులు జరిపారు. అయితే, దాడిలో కొంతమంది మావోయిస్టులు గాయపడటమే కాక.. మృతిచెంది ఉండొచ్చు. ఈ ఘటనలో భద్రతా బలగాలకు ఎటువంటి హానీ జరగలేదు. బేస్ క్యాంపు పాక్షికంగా ధ్వంసమైంది. అయితే, ఈ క్యాంపు నిర్మాణం జరిగేటప్పుడే ఆ ప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. హిడ్మా స్కెచ్ వేసి ఎన్నోమార్లు పోలీసులను మట్టుపెట్టిన ఘటనలు ఉన్నాయని ఎస్‌పి తెలిపారు. తన సొంత గ్రామంలో పోలీస్ బేస్ క్యాంపు నిర్మించడంతో సుమారు ఏడు నెలల పాటు మౌనంగా ఉన్న హిడ్మా ప్రణాళిక సిద్ధం చేసి కవ్వింపు చర్యగా రాకెట్ రాంచర్లతో మెరుపు దాడి చేశారని అన్నారు. ఈ క్రమంలో పోలీసులు బయటకు వస్తారు, వారందరినీ మట్టుబెట్టొచ్చని వ్యూహం పన్నారన్నారు. కానీ, పోలీసులు ఎంతో వ్యూహాత్మకంగా, సమయస్ఫూర్తితో మావోయిస్టుల దాడిని తిప్పి కొట్టినట్టు చెప్పారు. హిడ్మా గెస్ట్‌హౌస్, అతని తల్లి, చెల్లి, బంధు వర్గాన్ని అంతా పోలీసులు అదుపులోకి తీసుకున్నారని చెప్పారు.

చైనా కంపెనీల్లో సెబీ చీఫ్ పెట్టుబడులు

- లిస్టెడ్ కంపెనీల్లోనూ 36 కోట్లు ట్రేడింగ్
- మాధబి బుచ్‌పై కాంగ్రెస్ కొత్త విమర్శలు

న్యూఢిల్లీ : సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజీ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) ఛైర్‌పర్సన్ మాధబి పురి బుచ్ అక్రమ పెట్టుబడులు, ఆదాయాలపై రోజుకో సంచలన విషయం బయటపడుతోంది. హిండెన్‌బర్గ్ దెబ్బతో ఆమెపై అవినీతి ఆరోపణలు వెల్లువుల బయటికి వస్తోన్నాయి. చైనా సంస్థల్లో మాధబి పెట్టుబడులు కలిగి ఉన్నారని శనివారం కాంగ్రెస్ వెల్లడించింది. ఇప్పటికే కాంగ్రెస్, హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలకు మాధబి, ఆమె భర్త శుక్రవారం సుదీర్ఘ వివరణ ఇచ్చారు. తనపై వచ్చిన విమర్శల్లో నిజం లేదని వారు పేర్కొన్నారు. ఇంతలో మళ్లీ కాంగ్రెస్ కొత్త విమర్శలను ఎక్కుపెట్టింది. మాధబి సెబీ ఛైర్ పర్సన్ హోదాలో ఉంటూ పరస్పర విరుద్ధ ప్రయోజనాలు పొందారని కాంగ్రెస్ నేత పవన్ ఖేరా అన్నారు."సెబీలో ఉంటూ 2017 నుంచి 2023 మధ్య లిస్టెడ్ సెక్యూరిటీల్లో రూ.36.9 కోట్లు ట్రేడింగ్ చేశారు. 2018-19లో పెద్ద మొత్తంలో ట్రేడింగ్ నిర్వహించారు. విదేశీ ఫండ్స్‌లోనూ ఇన్వెస్ట్‌మెంట్ చేశారు. ఇందులో చైనాకు చెందిన పెట్టుబడులూ ఉన్నాయి. మొత్తం నాలుగు అంతర్జాతీయ ఫండ్స్‌లో ఆమె మదుపు చేశారు. అందులోనూ చైనాకు చెందిన గ్లోబల్ ఎక్స్ ఎంఎస్‌సిఐ చైనా కన్జూమర్, ఇన్వెస్కో చైనా టెక్నాలజీలకు చెందిన ఇటిఎఫ్‌లల్లో మాధబి పెట్టుబడులు పెట్టారు." అని పవన్ ఖేరా తెలిపారు. ఈ పెట్టుబడులను మాధబి ఎప్పుడూ ప్రకటించలేదని ఖేరా అన్నారు. ఈ విషయం ప్రభుత్వ ఏజెన్సీలకు తెలుసా..? అని ఆయన ప్రశ్నించారు. అలాగే సెబీ ఛైర్‌పర్సన్ ఇచ్చిన వివరణనూ తోసిపుచ్చారు. ముఖ్యంగా ఐసిఐసిఐ, మహీంద్రా గ్రూప్ విషయంలో ఇచ్చిన వివరణ ఏమాత్రం సరిపోదన్నారు. ఖేరా తాజా వ్యాఖ్యలకు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేష్ మరోమారు ప్రధానీ నరేంద్ర మోడీపై విమర్శలు ఎక్కుపెట్టారు. "సెబీ ఛైర్ పర్సన్‌పై వస్తున్న ఆరోపణల గురించి మోడీకి తెలుసా..?. బయటకు వెల్లడించిన సున్నితమైన ధరల సమాచారం కలిగిన లిస్టెడ్ సెక్యూరిటీల్లో సెబీ ఛైర్‌పర్సన్ ట్రేడింగ్ చేసిన విషయం తెలుసా..?. భారత్ వెలుపల సెబీ చీఫ్‌కు పెట్టుబడులు ఉన్న విషయం తెలుసా..?. ఒకవేళ తెలిస్తే పెట్టుబడులు, ఆయా తేదీలు చెప్పగలరా..? ఓ వైపు చైనాతో భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ సెబీ ఛైర్‌పర్సన్ చైనా కంపెనీల్లో పెటుబడులు పెట్టిన విషయం తెలుసా..?." అని జైరామ్ రమేష్ ప్రశ్నించారు.

చట్టాల ఉల్లంఘనలో ఇ-కామర్స్ సంస్థలు

- మొబైల్ కంపెనీలతో కుమ్మక్కు
- అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లపై సిసిఐ ఆగ్రహం
- వినియోగదారులపై భారం

న్యూఢిల్లీ : ఆన్‌లైన్ విక్రయ సంస్థలు పోటీ వాతావరణాన్ని దెబ్బతీస్తూ వినియోగదారులపై భారం మోపుతున్నాయి. సామ్‌సంగ్, షావోమి తదితర స్మార్ట్‌ఫోన్ కంపెనీలతో అమెజాన్, వాల్‌మార్ట్‌కు చెందిన ఫ్లిప్‌కార్ట్‌లు కుమ్మక్కు అయ్యాయి. భారత చట్టాలను ఉల్లంఘిస్తూ ప్రత్యేకంగా ఉత్పత్తులను ఆవిష్కరిస్తున్నాయని రాయిటర్స్ ఓ రిపోర్ట్‌లో వెల్లడించింది. ఆ వివరాలు.. కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) నిర్వహించిన యాంటీట్రస్ట్ పరిశోధనలలో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ స్థానిక పోటీ చట్టాలను ఉల్లంఘించాయి. ఎంపిక చేసిన విక్రేతలకు ప్రాధాన్యత ఇవ్వడం, కొన్ని ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇవ్వడం, ఉత్పత్తులను బాగా తగ్గించడం ద్వారా డిమాండ్ పెంచడం ద్వారా ఇతర కంపెనీలను దెబ్బతీస్తున్నాయి. సామ్‌సంగ్, షావోమి, మోటోరోలా, రియల్‌మీ, వన్‌ప్లస్‌కు చెందిన భారతీయ యూనిట్ మొబైల్ తయారీ కంపెనీలు ప్రత్యేకంగా ఫోన్‌ల ఆవిష్కరణలో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌లు భాగస్వామ్యం అవుతున్నాయి. ఈ క్రమంలో భారత పోటీ చట్టాలను ఉల్లంఘిస్తూ మొబైల్ కంపెనీలతో కుమ్మక్కు అవుతున్నాయి. ఈ విషయమై అమెజాన్‌పై సిసిఐ 1,027 పేజీల రిపోర్ట్‌ను రూపొందించింది. ఫ్లిప్‌కార్ట్‌పై 1,699 పేజీల నివేదికను తయారు చేసింది. అదే విధంగా మోటోరోలా, వివో, లెనోవో, రియల్‌మీ కంపెనీలు కూడా ఇదే తరహా ఉల్లంఘనలకు పాల్పడుతున్నాయని సిసిఐ తన రిపోర్ట్‌లో పేర్కొంది. 'వ్యాపారంలో ప్రత్యేక విక్రయాలు అనేది అసహ్యకరమైనది. పోటీతత్వానికి వ్యతిరేకం. ఇది వినియోగదారుల ఆసక్తులను దెబ్బతీస్తుంది." అని అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ రిపోర్ట్‌ల్లో సిసిఐ అడిషనల్ డైరెక్టర్ జనరల్ జివి శివ ప్రసాద్ ప్రస్తావించారు.

సంపాదకీయం


దేహమూ ప్రజాసేవకే..!

దానాలన్నీ వేటికవే గొప్పవి. కొన్ని దానాలు తాత్కాలికంగా సంతోషపెట్టేవి. మరికొన్ని కొంతకాలం ఆనందింపజేసేవి. ఇంకొన్ని దానాలు జీవితాంతం చిరస్థాయిగా నిలిచిపోయేవి. అన్నదానం, విద్యాదానం, రక్తదానం వంటివి గొప్పవే. మానవేతిహాసంలోని అన్నిరకాల శాస్త్రాలు, ధర్మాలు పరోపకారార్థం పాటుపడమని బోధిస్తున్నాయి. 'పరోపకారార్థం ఇదం శరీరం' అన్నారు. మనిషి మరణానంతరం అవయవ దానం నేటికాలంలో విశిష్టమైనది. ఒక వ్యక్తి అవయవ దానంతో 8 మందికి ప్రాణదానం చెయ్యొచ్చు. ఇచ్చిన మాట కోసం శిబి చక్రవర్తి తన శరీరాన్నే ఫణంగా పెట్టినట్లు పురాణాల్లో ఒక కథ. 'మహారాజులైనా మహి వీడు వేళ కొనిపోయినారా తమవెంట సిరుల/ నెరదాత పేరే నిలిచేది ధరణి, నీ దానం, నీ ధర్మం నిరుపేదల జీవాధారం' అంటారు సుమతీ శతకంలో. ఇప్పుడు వీటన్నింటికంటే ఉత్కృష్టమైనది... అత్యంత విశిష్టమైనది శరీర దానం. ఎంతో మందికి పునర్జన్మనివ్వగల విజ్ఞానవంతుల్ని తయారు చెయ్యగలది శరీరదానం. ఔదార్యం మంచి లక్షణం. దానం గొప్ప గుణం. ఇలాంటి అత్యున్నత లక్షణాలు కలిగిన వారిని చరిత్ర ఎప్పటికీ మర్చిపోదు. మనం మనకోసం చేసేది మనతోనే అంతరించిపోతుంది. పరుల కోసం చేసేది శాశ్వతంగా నిలుస్తుంది.

"కన్ను తెరిస్తే జననం... కన్ను మూస్తే మరణం... ఈ మధ్యదే జీవితం' అంటాడు జాలాది. అన్ని దానాల్లోకెల్లా ప్రాణ దానం మిన్న. అలాగని తమ ప్రాణాన్ని ఎవరూ దానం చెయ్యరు. మరణానంతరం అయినా తమ శరీరంలోని అవయవాలను దానం చేయడం ద్వారా కొందరికైనా పునర్జన్మ ప్రసాదించవచ్చు. అవయవదానం అంటే మరణాన్ని గెలవడం. శరీర దానం అంటే... ఆ మరణాన్ని జయించడానికి అవసరమైన పరిశోధకులకు విజ్ఞానాన్ని ప్రసాదించడం. మొత్తం శరీరాన్నే వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం దానం చేయడం. జ్యోతిబసు దగ్గర నుంచి సీతారాం ఏచూరి వరకూ ఎందరో కమ్యూనిస్టులు మరణానంతరం తమ దేహాలను పరిశోధనలకు దానం చేశారు. ప్రజా పోరాటాల్లో బతుకుతూ, ప్రజాసేవ కోసం జీవితాలను త్యాగం చేసే కమ్యూనిస్టులు... చివరకు మరణానంతరం తమ దేహాన్ని సైతం ప్రజాసేవకే అంకితం చేస్తారు. ఈ రకమైన ఒరవడికి శ్రీకారం చుట్టింది కూడా కమ్యూనిస్టులే. అక్కడక్కడ ఇతరులు ఒకటీఅరా వున్నప్పటికీ... తమ భౌతిక కాయాన్ని వైద్య విద్యార్థుల బోధన, పరిశోధనల కోసం ఉపయోగపడాలన్న సంప్రదాయాన్ని కమ్యూనిస్టులు కొనసాగిస్తున్నారు. గురువారం కన్నుమూసిన సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి భౌతిక కాయాన్ని వైద్యవిద్యార్థులకు ఉపయోగపడాలన్న సత్సంకల్పంతో ఎయిమ్స్‌కు అప్పగించారు. 'మానవులు చనిపోవచ్చు, దేశాలకు దేశాలే నాశనమవవచ్చు, కానీ ఒక ఆదర్శభావం ఎప్పుడూ సజీవంగానే వుంటుంది' అంటారు జాన్.ఎఫ్.కెనడీ. కమ్యూనిస్టులు తమ పార్థివ దేహాలను పరిశోధనలకివ్వడం ఇదే తొలిసారి కాదు. ఓ పరంపరలో ఇది అంతర్భాగమే.

భారత్‌లో మూఢ నమ్మకాలు, విశ్వాసాలు ఎక్కువ. అవయవ దానం, శరీర దానంపై చాలామందిలో మూఢ నమ్మకాలు వున్నాయి. అంతిమ సంస్కారం సాంప్రదాయ బద్ధంగా జరగాలని, లేకపోతే పున్నామ నరకాలకు పోతారనే విశ్వాసాలతో కొట్టుకుపోతుంటారు. 'సంకల్పమునకు సత్కార్యారంభమునకు వ్యవధానముండకూడదు' అంటాడు వివేకానందుడు. మరణానంతరం తమ శరీరం పరిశోధనలకు ఉపయోగపడాలనే సదుద్దేశంతో కొందరు దేహ దానాలకు ముందుకు వస్తున్నారు. భవిష్యత్ తరాల ఆరోగ్యాభివృద్ధికి చేసే ప్రయోగాలకు తమ శరీరాలను అప్పగిస్తూ... కొత్త చరిత్రకు శ్రీకారం చుడుతున్నారు. 'మానవ జాతికి అత్యధికంగా మేలు చేయగల వృత్తిని మనం ఎంచుకున్నట్లయితే, మనం దేనికీ తల వంచనవసరం లేదు. ఎందుచేతనంటే, అది అందరికోసం చేసే త్యాగం' అంటారు కారల్ మార్క్స్ ఓ సందర్భంలో. 'లక్ష్య రహిత గమ్యరహితమైన బ్రతుకు వద్దు మనకు/ నిస్సారపు నిర్జీవపు కాకి బ్రతుకు వద్దు మనకు' అంటారాయన. అందుకే కమ్యూనిస్టులు తమ జీవితాలను, దేహాలను ప్రజాసేవకే అంకితం చేస్తారు. అందులోనే తృప్తిని పొందుతారు. తద్వారా ఎంతోమందికి స్ఫూర్తినిస్తారు.

మహనీయుల మాట



సమాజం మతం మత్తులో పడకుండా వుండాలంటే, మూఢనమ్మకాలు తొలగిపోవాలంటే విద్యా విధానంలో మార్పు రావాలి.
- థామస్ అల్వా ఎడిసన్, ప్రసిద్ధ శాస్త్రవేత్త.

Thomas A. Edison

ఆశయ పతాకమై...ఆఖరు దాకా!

ప్రస్తుతం



తెలకపల్లి రవి

సీతారాం ఏచూరి సి.పి.ఎం లో అత్యున్నత నాయకుడు అని ఆ పార్టీ పొలిట్‌బ్యూరో జోహార్లర్పించింది. వామపక్ష ఉద్యమ కాంతి అని ప్రధాని నరేంద్ర మోడీ అభివర్ణించారు. ఏచూరితో సంప్రదింపుల ప్రక్రియను తాను పోగొట్టుకున్నానని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ నివాళులర్పించారు. స్నేహశీలి, ప్రతిభాశాలి అని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ప్రత్యేకంగా వ్యాసం రాశారు. భారత రాజకీయాలలో ఏచూరిది గౌరవ ప్రదమైన స్థానమనీ, ఇతర పార్టీలకూ అందుబాటులో వుండే ప్రజ్ఞావంతుడైన నాయకుడనీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కొనియాడారు. ప్రొఫెసర్ సి.పి.చంద్రశేఖర్, ప్రబీర్ పుర్కాయస్థ, బదరీ రైనా వంటి సమకాలీనులు జెఎన్‌యు కాలంలోనూ, సిపిఎం అగ్రనేతగానూ ఆయన మానవీయ వైఖరిని ఆర్ద్రంగా ప్రస్తావించారు. డజన్ల మంది సంపాదకులు, పాత్రికేయులు ఆయన ఎంతగా తమతో కలిసిపోయేవారో రాజకీయ గీత దాటకుండానే చెప్పవలసింది చెప్పేవారో అనుభవాలతో రాశారు. పుస్తక ప్రియుడుగా, పాటల ప్రేమికుడుగా, మీడియా సినీ ప్రపంచంలో మార్పులను గమనించే జిజ్ఞాసిగా ఆయన తీరును రచయితలు, కళాకారులు నెమరేసుకున్నారు. అదే సమయంలో ఏచూరిని ఆచరణ వాది అనీ, అన్ని పార్టీలకూ కామ్రేడ్ అనీ చాలామంది వ్యాఖ్యానించారు. ఆయన పదవీ కాలం ఎదురీతగా నడిచిందన్నట్టు, ఈ పదిహేనేళ్లలో క్రమేణా మరింత క్షీణించిపోయిందన్నట్టు తెలుగులోనూ కొన్ని సంపాదకీయాలే వెలువడ్డాయి. సి.పి.ఎం విధాన రూపకల్పనలో అంతర్గత చర్చను వ్యక్తిగతంగా నాయకుల మధ్య తేడాగా చూపే రాతలూ మాటలు సరేసరి. వ్యక్తిగతంగా ఆయనకు సంతాపం తెలుపుతూ ఆయన జీవితాంతం పోరాడిన మౌలిక సిద్ధాంతాలను తక్కువ చేసే ఒక ధోరణి కూడా కొన్నిటిలో వ్యక్తమైంది.

ఉద్యమ నిబద్ధత

అటూ ఇటూ ఐ.ఎ.ఎస్ లు, ఇంజనీర్లు, న్యాయమూర్తుల కుటుంబంలో అత్యంత ప్రతిభావంతమైన విద్యార్థిగా ప్రారంభమైన ఏచూరి అర్థశాస్త్ర అధ్యయనం తర్వాత ప్రజా ఉద్యమానికి అంకితం కావాలని నిర్ణయించుకోవడం, ప్రకాశ్ కరత్ వంటి వారు అందుకు తోడు కావడం అత్యంత సహజం. అగ్రశ్రేణి ప్రజ్ఞాశాలులు వామపక్ష భావాలను స్వీకరించి ప్రజల కోసం పని చేయడం ప్రపంచ వ్యాపితంగా జరిగింది. 'ఒక దాహార్తుడు మంచి నీటి కోసం వచ్చినట్టు తాను ప్రతి ఏటా కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వాన్ని పునరుద్ధరించుకోవడానికి వస్తానని' ప్రసిద్ధ చిత్రకారుడు ప్లాబో పికాసో అనేవారని ఏచూరి ఎప్పుడూ గుర్తుచేసేవారు. ఆ కోవలోనే ఆయన సార్థక జీవితం గడిపారు. ఐసియు నుంచి పంపిన ఆఖరి సందేశం కూడా పాలస్తీనా విముక్తి పోరాటం గురించి కావడం యాదృచ్ఛికం కాదు. మీరు ఓడిపోతే ఎవరితో కలుస్తారు అని ఒక ఇంటర్వ్యూలో బర్కాదత్ అడిగితే 'నేను విజయం సాధించగలననే నమ్మకంతో పోరాడుతున్నాను. ఓడిపోతే ఏం చేస్తావని మీరడిగితే ఎందుకు జవాబు చెప్పాలి?' అని ఎదురు ప్రశ్న వేశారు. జెఎన్‌యు విద్యార్థి నాయకుడుగా ఇందిరా గాంధీతో రాజీనామా చేయించడం ఆయన మొదటి విజయమైతే మతతత్వ రాజకీయాలపై పోరాటంలో విశాల ఐక్యతను పెంపొందించి బిజెపికి మెజార్టీ రాకుండా చేయడంలో ఫలప్రదం కావడం ఆయన ఆఖరి కీలక చొరవ.



మోడీ కాలానికే పరిమితమై పాఠాలు తీస్తే కుదరదు. 1977లో ప్రజలు తిరస్కరించిన ఇందిరా గాంధీ 1980లో తిరిగి అధికారానికి వచ్చారు. 1984లో ఆమె హత్య ప్రభావంతో రాజీవ్ గాంధీ 400 పైన స్థానాలతో ప్రధాని అయ్యారు. 1985లో ప్రకాశ్ కరత్, సీతారాం ఏచూరి వంటి వారు సిపిఎం నూతన తరం నాయకులుగా బాధ్యతలలో తొలి అడుగు వేసినప్పటి పరిస్థితి అది. రాజీవ్ గాంధీ తర్వాతి ఎన్నికలలోనే ఓటమిపాలై నేషనల్ ఫ్రంట్ అనే లౌకిక కూటమి అధికారంలోకి వచ్చింది. వి.పి. సింగ్ ప్రభుత్వంలో బిజెపి చేరకుండా ఆపగలగడం, రథయాత్రను షరతుగా ఆ పార్టీ మెడ మీద కత్తి పెడితే అడ్డుకుని అధికారాన్ని వదులుకోవడం వెనక వామపక్షాల పాత్ర చాలా వుంది. జాతీయ రాజకీయాలలో అప్పటి సిపిఎం ప్రధాన కార్యదర్శి హరికిషన్ సింగ్ సూర్జిత్, జ్యోతిబసుతో పాటు ఏచూరి ప్రవేశించడం వేగం పుంజుకుంది. ఇంత సుదీర్ఘ కాలం పాటు జాతీయ రాజకీయ రంగంలో లౌకిక కూటముల ఏర్పాటు వ్యూహ ప్రతివ్యూహాలలో ప్రత్యక్ష పాత్ర వహిస్తూ వస్తున్న వారు బహుశా ఎంతో మంది వుండరు. విధాన స్పష్టతతో పాటు వ్యక్తిగత స్నేహ సంబంధాలు, పట్టు విడుపులతో వ్యవహరించే ఏచూరి స్వభావం అందుకు గొప్పగా దోహదపడింది. వృద్ధ నాయకులతో పాటు యువ తరంతోనూ సులభంగా కలిసిపోవడమే ఆయనను మరింత జన ప్రియుణ్ని చేసింది.

నాలుగు దశాబ్దాల నడక

నిర్దిష్ట పరిస్థితులకు నిర్దిష్ట అన్వయం అనే మార్క్సిస్టు మూల సూత్రం పాటించడం, అధ్యయనాలు, ఘన విజయాలతో పాటు ఎదురు దెబ్బలూ ప్రతికూలతలూ అధిగమిస్తూ ముందుకు పోవడం ఏచూరి రాజకీయ జీవిత గమనంలో కీలకాంశమని వ్యాఖ్యాతలు గుర్తించవలసి వుంటుంది. మోడీ కాలానికే పరిమితమై పాఠాలు తీస్తే కుదరదు. 1977లో ప్రజలు తిరస్కరించిన ఇందిరా గాంధీ 1980లో తిరిగి అధికారానికి వచ్చారు. 1984లో ఆమె హత్య ప్రభావంతో రాజీవ్ గాంధీ 400 పైన స్థానాలతో ప్రధాని అయ్యారు. 1985లో ప్రకాశ్ కరత్, సీతారాం ఏచూరి వంటి వారు సిపిఎం నూతన తరం నాయకులుగా బాధ్యతలలో తొలి అడుగు వేసినప్పటి పరిస్థితి అది. రాజీవ్ గాంధీ తర్వాతి ఎన్నికలలోనే ఓటమిపాలై నేషనల్ ఫ్రంట్ అనే లౌకిక కూటమి అధికారంలోకి వచ్చింది. వి.పి. సింగ్ ప్రభుత్వంలో బిజెపి చేరకుండా ఆపగలగడం, రథయాత్రను షరతుగా ఆ పార్టీ మెడ మీద కత్తి పెడితే అడ్డుకుని అధికారాన్ని వదులుకోవడం వెనక వామపక్షాల పాత్ర చాలా వుంది. జాతీయ రాజకీయాలలో అప్పటి సిపిఎం ప్రధాన కార్యదర్శి హరికిషన్ సింగ్ సూర్జిత్, జ్యోతిబసుతో పాటు ఏచూరి ప్రవేశించడం వేగం పుంజుకుంది. ఇంత సుదీర్ఘ కాలం పాటు జాతీయ రాజకీయ రంగంలో లౌకిక కూటముల ఏర్పాటు వ్యూహ ప్రతివ్యూహాలలో ప్రత్యక్ష పాత్ర వహిస్తూ వస్తున్న వారు బహుశా ఎంతో మంది వుండరు. విధాన స్పష్టతతో పాటు వ్యక్తిగత స్నేహ సంబంధాలు, పట్టు విడుపులతో వ్యవహరించే ఏచూరి స్వభావం అందుకు గొప్పగా దోహదపడింది. వృద్ధ నాయకులతో పాటు యువ తరంతోనూ సులభంగా కలిసిపోవడమే ఆయనను మరింత జన ప్రియుణ్ని చేసింది.

విజయ పరంపరలు సాధిస్తున్నప్పుడు రాజకీయాలు నడపడం పెద్ద సమస్య కాదు. పరిస్థితులు ప్రతికూలంగా మారినప్పుడు సిద్ధాంత స్ఫూర్తిని నిలబెట్టడం పెద్ద సవాలు. 90వ దశకం ప్రారంభం నుంచి మతతత్వ రాజకీయాలు పెరగడం, పాలక పార్టీల అవకాశవాద రాజకీయాలు లౌకిక ప్రజాస్వామ్యానికి పెను సవాలు విసిరాయి. అంతర్జాతీయంగా సోషలిస్టు శిబిరం ఎదురు దెబ్బ తినడం అశనిపాతమైంది. దాన్ని వెంటనంటి దేశంలోనూ సరళీకరణ విధానాలు, ద్రవ్య పెట్టుబడి విజృంభణ రాజకీయాల స్వరూపమే మార్చివేశాయి. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో సైద్ధాంతికంగానూ దిశా నిర్దేశం చేయడంలో ఏచూరి వంటి వారి పాత్ర చాలా ప్రధానమైంది.

కీలక విధాన పత్రాలు

విజయ పరంపరలు సాధిస్తున్నప్పుడు రాజకీయాలు నడపడం పెద్ద సమస్య కాదు. పరిస్థితులు ప్రతికూలంగా మారినప్పుడు సిద్ధాంత స్ఫూర్తిని నిలబెట్టడం పెద్ద సవాలు. 90వ దశకం ప్రారంభం నుంచి మతతత్వ రాజకీయాలు పెరగడం, పాలక పార్టీల అవకాశవాద రాజకీయాలు లౌకిక ప్రజాస్వామ్యానికి పెను సవాలు విసిరాయి. అంతర్జాతీయంగా సోషలిస్టు శిబిరం ఎదురు దెబ్బ తినడం అశనిపాతమైంది. దాన్ని వెంటనంటి దేశంలోనూ సరళీకరణ విధానాలు, ద్రవ్య పెట్టుబడి విజృంభణ రాజకీయాల స్వరూపమే మార్చివేశాయి. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో సైద్ధాంతికంగానూ దిశా నిర్దేశం చేయడంలో ఏచూరి వంటి వారి పాత్ర చాలా ప్రధానమైంది. సోవియట్ విచ్ఛిన్నం తర్వాత వెనువెంటనే మద్రాసులో జరిగిన 14వ మహాసభలో సైద్ధాంతిక సమస్యలపై తీర్మానం ప్రవేశపెట్టే బాధ్యత ఏచూరికి అప్పగించడమే ఇందుకు నిదర్శనమైంది. అప్పటికి మాకినేని బసవపున్నయ్య, జ్యోతిబసు, ఇ.ఎం.ఎస్, సూర్జిత్ వంటి హేమాహేమీలు వున్నారని గుర్తుంచుకోవాలి. 2012లో మారిన పరిస్థితులకు తగినట్టు తాజాపర్చిన సిపిఎం కార్యక్రమాన్ని సమర్పించే పని కూడా ఆయనే నిర్వహించారు. అంతర్జాతీయ విభాగం బాధ్యుడుగా దేశ దేశాల కమ్యూనిస్టు ఉద్యమాలు, ప్రగతిశీల శక్తులతో సంబంధాలు, ఆయనకు అపారమైన అవగాహన, సమగ్ర సమాచారం చేరుతుండేది. ఆ విధంగా ఆయన విశ్వ విప్లవ నరుడు!

పదునైన ప్రచారం

1992-93 తర్వాత ముదిరిన మత శక్తులపై ప్రత్యేక అధ్యయనం చేసి హిందూ రాష్ట్ర సిద్ధాంతం, దేశ సాంస్కృతిక వైవిధ్యంపై దాడి వంటి అంశాలను ఆయన ప్రతిభావంతంగా ముందుకు తెచ్చారు. గాట్, పేటెంట్ల పెత్తనం వంటి ఆర్థికాంశాలనూ విడమర్చి చెప్పగలిగారు. ఆ ఇరవయ్యేళ్లలో ఆయన పీపుల్స్ డెమోక్రసీ సంపాదకుడుగానూ అనేక విధాల ప్రయోజనకరమైన సమాచారాన్ని అందుబాటులోకి తెచ్చారు. బయిటి పత్రికల్లోనూ రాస్తూ వచ్చారు. చానళ్ల విషయానికి వస్తే ఆయన తొలి నుంచి పరిచితమైన వ్యాఖ్యాత. దేశ రాజధానిలోని మేధా బృందాలు, కళాకారులతో ప్రత్యేక సంబంధాలు పాటిస్తూ భిన్న ప్రవంతుల స్పందనలను గమనించడంలో ఆయన చాలా శ్రద్ధ పెట్టేవారు. బాబ్రీ విధ్వంసం తర్వాత ఇలాంటి వారెవరో ఎదురుపడి అడిగితే సరదాగా 'వినిర్మాణం' (డికన్‌స్ట్రక్షన్) అంటూ ఆధునికానంతర వాదంలో వాడే పదాన్ని ప్రయోగించారట. అదో చర్చ అయింది. మామూలూ భాషలో మాట్లాడుతూనే రాజ్యాంగ కోణాలు, సామాజిక వైరుధ్యాలు, అభివృద్ధి నిరోధక సవాళ్లు, ప్రపంచీకరణ ప్రభావాలు కళ్లకు కట్టినట్టు చెప్పడానికి ఆయన మేధస్సు కారణమైంది. మనోభావాల పేరిట ఈ పదాలను అడ్డుపెట్టుకుని రాజకీయం నడిపే వారిని నిలదీయడానికి ఇదే దారితీసింది. సామాజిక న్యాయంకోసం పోరాటం అవసరాన్ని ఎప్పుడూ గుర్తించడమే గాక అంబేద్కర్ మాటలను ఉటంకిస్తుండేవారు. 1993లో నేను విజయవాడ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడుగా మీట్ ద ప్రెస్‌కు పిలిస్తే ఆయన తాను చిన్నప్పుడు సంధ్యావందనంతో మొదలెట్టానని చెప్పడం, ఈనాడు మిత్రులు ప్రముఖంగా రాయడం అందరినీ ఆకర్షించింది. మనువాదంపై పోరాటం గురించి చెప్పడానికే ఈ ప్రస్తావన తెచ్చారు. 2017లో ఇదే రాజ్యసభలోనూ ప్రస్తావించి తన భార్య, ఆమె తలిదండ్రులు వేర్వేరు మతాలకు, రాష్ట్రాలకూ చెందిన వారనీ, ఇప్పుడు తన కొడుకును భారతీయుడుగా తప్ప మరేమని పిలవగలమని ప్రశ్నిస్తే చప్పట్లు మోగాయి. ఈ విధంగా భారత దేశం అనే భావన చర్చ తీసుకురావడంలోనూ చాలా సృజనాత్మకత కనిపిస్తుంది. ఇప్పుడు పాలక పార్టీలు అవకాశవాదం కొంతైనా తగ్గించుకుని మత రాజకీయాలను విమర్శిస్తూ మాట్లాడుతున్నారంటే అది ఇలాటి కృషి ఫలితమేనన్నది నిర్వివాదాంశం. తనను నాయకుడిని చేసిన జె.ఎన్.యుపై మోడీ సర్కారు ఉక్కుపాదం మోపినపుడు జరిగిన రాజ్యసభ చర్చలో షేక్‌స్పియర్ భాషలో నాటి మంత్రి స్మృతి ఇరానీకి జవాబిచ్చిన తీరు ఎవరూ మర్చిపోరు. ఎ.పి విభజన హడావుడిగా ఆమోదించవద్దని సావధానంగా చర్చించాలని నాడు ఆయన పట్టుపట్టిన తీరు ఎంత అర్థవంతమో ఇప్పటికీ అపరిష్కృతంగా వున్న విభజన సమస్యలను చూస్తే తెలుస్తుంది. కొన్నేళ్ల కిందట సిపిఎంలో విభేదాల గురించి, తన బాధ్యతల గురించి మీడియాలో అదేపనిగా ఊహాగానాలు సాగుతున్నప్పుడు కూడా సూటిగానూ సున్నితంగానూ సమాధానమిచ్చి ముగించిన ఏచూరి చివరకు-ప్రధాన కార్యదర్శిగానే జీవితం ముగించిన మొదటి నేత అయ్యారు.

తెలుగింటి బిడ్డగా...

బెంగాలీ, తమిళం, మరాఠీ, హిందీతో సహా బహు భాషా కోవిదుడైన ఏచూరి తెలుగు బిడ్డ కావడం ప్రత్యేకంగా గర్వకారణమైన విషయం. దేశ భాషలందు తెలుగు లెస్స అన్న పద్యం మూలాలను గురించి చర్చించిన సందర్భం నాకింకా గుర్తుంది. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత కేతు విశ్వనాథరెడ్డి ప్రత్యేకించి తన పుస్తకానికి ఆయనతో ముందుమాట రాయించుకున్నారు. శాస్త్రీయ సంగీతంలో ముగ్గురు ప్రముఖులు దక్షిణాది వారే కావడంపై ఆ ముందుమాటలో ప్రస్తావించడం చాలా చర్చ అయింది. చెన్నై, కాకినాడ నుంచి హైదరాబాద్ వరకూ ఏచూరివే. ప్రతి సభలోనూ తాము ఢిల్లీలో వుండిపోవడం వల్ల సరైన తెలుగు మాట్లాడలేనంటూ మొదలు పెట్టినా అదో ఆకర్షణీయమైన భాష మాట్లాడేవారు. 'మన రక్తం ఎర్రగా వున్నంత వరకూ ఎర్ర జండా ఎగురుతుంటుందని' ఆయన అనే మాటతో చప్పట్లు మోగిపోయేవి. బస్సుల్లో మన డబ్బులు కొట్టేసిన దొంగే మళ్లీ టికెట్టు కొనిచ్చి సహాయం చేసినట్టు పోజు పెట్టే కథ కూడా తప్పనిసరి. పాలకుల తీరుకు ఉదాహరణగా ఇది చెప్పేవారు. ఇలాంటి తమాషాలెన్నో. అసలు ఆయన ఎంట్రీయే ఏదో ఒక చలోక్తితో జరిగేది.

1980 నుంచీ..

1980లో ఏచూరి విజయవాడలో ఎస్.ఎఫ్.ఐ రాష్ట్ర మహాసభలకు హాజరైన నాటి కవరేజి నుంచి వ్యక్తిగతంగానూ ప్రజాశక్తి పరంగానూ ఆయనతో ఎన్నో మంచి జ్ఞాపకాలున్నాయి. ప్రతి అఖిల భారత మహాసభల్లో ఆయనతో ఒక ఇంటర్వ్యూ తీసుకోవడం తప్పనిసరిగా వుండేది. అర్థశాస్త్రం పాఠాలకు పేరుపొందిన మా నాన్న పుస్తకం 2012 ఖమ్మం మహాసభలో ఏచూరితో ఆవిష్కరింపచేయాలని అడిగితే వెంటనే ఒప్పుకోవడమే గాక రాజకీయ అర్థశాస్త్రం ప్రాథమిక సూత్రాల ప్రాధాన్యత ఏంటో గొప్పగా వివరించారు. మా కుటుంబానికి సంబంధించిన ఒక ప్రత్యేక సహాయం అడిగితే వెనువెంటనే చేయడం ఎప్పటికీ మర్చిపోలేము. తన ప్రజ్ఞా పాటవాలనూ శక్తియుక్తులనూ ప్రజల కోసం ఉద్యమాలకు అంకితం చేయడం తప్ప స్వంతానికి ఏమీ కోరుకోని ఏచూరి వంటి వారి గురించి ఎన్ని, ఎంత రాసినా ఇంకా మిగిలే వుంటాయి. ఆయనకిదే నివాళి. ఆ అధ్యయనం, ఆచరణ, సమగ్ర మానవీయ కోణం సదా అనుసరణీయం. సవాళ్లను ఎదుర్కోవడానికి అదే మార్గం.

★

యోధుడా.. లాల్ సలామ్..

లాల్ సలామ్..యోధుడా లాల్ సలామ్
ఒరిగిపోయింది గంభీరంగా (ఒక) ఉద్యమ శిఖరం
తరలిపోయింది నిశ్శబ్దంగా (ఒక) విప్లవ కెరటం
రాలిపోయింది అరుణ తార
తెలుగింట పొంగె కన్నీటి ధార
నింగికెగిసె నవక్రాంతి గీతాలు పలికిన ఎర్ర సితార!!
లాల్‌సలామ్..యోధుడా..లాల్‌సలామ్!
గుండెగుండెను మండించి రగిలించిన నిప్పుకణం
తనువణువణువున తొణికిసలాడే ఉజ్వల త్యాగ గుణం,
ఎదిరిగుండెలో దడ పుట్టించే యోధుడు ఏచూరి
మనకిక లేడని పొగిలి యేడ్చింది దేశం పొగచూరి !!
లాల్ సలామ్..యోధుడా..లాల్ సలామ్!
అధ్యయనం లేకుండా ఉద్యమ గమనం సాగదని
పిడికిళ్ళెత్తక కీచక పాలన గ్రహణం వీడదని
నినదించిన నవ భారత వీర కిశోరం ఏచూరి
అలుపెరగక కడదాకా తా నడిచింది ఎర్రదారి !!
లాల్ సలామ్..యోధుడా..లాల్ సలామ్!
మానవ జీవన మార్గదర్శి ఆ మార్క్స్ మాట గమ్యం
ఆ మార్గం లోన సాగి నిలపాలి నేడు ప్రజాస్వామ్యం,
అని ఎలుగెత్తిన అందరికిష్టుడు సీతారాం ఏచూరి
పోరాటమె ఊపిరిగా సాగిన విప్లవ పథ సంచారి !!
లాల్ సలామ్..యోధుడా..లాల్ సలామ్!
తాను నడిచిన దారిలోన విరిసింది ఎర్రమందారం
తనను చూసి ఎరుపెక్కి చైతన్యమాయే సింధూరం
ఎత్తిన పిడికిలి దించని ఓ మా నాయకుడా ఏచూరీ
విడువబోము మావిప్లవస్ఫూర్తి నువు చూపిన దారి!!
లాల్ సలామ్..యోధుడా..లాల్ సలామ్!

- లాంగుల్య



మార్క్సిజం మందారం

ఏడీ! ఆ ముద్దుబిడ్డ
సీతారాం ఏచూరీ?
కంటతడితో అడిగింది
ఉద్యమాల రాదారి!
అయ్యో! స్వర భాస్వరమని
తల్లడిల్లి...ఢిల్లీ
గతం గుర్తు చేసుకుంది
కళ్ళల్లో నీళ్ల తుళ్ళి!
ప్రియతముడా! ఏచూరీ
పీడిత జన బాంధవుడా!
అరుణారుణ వందనాలు
అందుకో కామ్రేడా!
మార్క్సిజం మందారం..అందమైన నవ్వు
శ్రామిక భారతమాత
సిగపువ్వువు నువ్వు!
విద్యార్థి దశలోనే విప్లవ పాఠాలు నేర్చి
ప్రజా ఉద్యమాలకు ప్రాణవాయువైనావు
ఇష్టమైన సిపిఎం భావధార కొరకు
అంకితం చేశావు ఐదు దశాబ్దాల బ్రతుకు!
అధ్యయనం, అనుభవాలు మేళవించినావు
సైద్ధాంతిక సంస్కరణల సారథివైనావు
విరామాలు ఎరుగనివాడా! విశ్రాంతులు
కోరనేవాడా!
నవతరం హృదయాలకు నచ్చిన చెలికాడా!
పేట్రేగిపోతున్న కుల, మత ఉన్మాదాలను
చట్ట సభలో ప్రశ్నించి, పదే పదే
ప్రతిఘటించి
రాజ్యసభలో రాష్ట్రపతి మాటలనే సవరించి
చరితను సృష్టించావు చరితార్థుడవు నీవు!
వ్యవస్థలకు తూట్లు పొడిచి, చట్టాలకు
స్థితులు పేర్చి
కార్పొరేట్ శక్తులకు, బానిసలను సమకూర్చే
నియంతృత్వ పాలనపై నిరంతరం పోరాటం
నీవెగరేసిన జెండా! నీ స్ఫూర్తి గుండె నిండా!
మన రక్తం ఎర్రగా ఉన్నంత వరకూ..
ఎర్రజెండా ఉంటుందని ప్రకటించిన విశ్వాసీ!
నిన్ను ఆచరించడమే నిజమైన నివాళి
ప్రతి కార్యకర్తకు ఇది ప్రతిజ్ఞ కావాలి.

- నల్లి ధర్మారావు

సీతారామ్... లాల్ సలామ్!!

అయ్యో...
అదేమిటయ్యా సీతారాముడా...
దేశం మతం మత్తులో ఊగుతున్న సమయంలో
వేషం మార్చి, భాషలు నేర్చి జనాన్ని ఏమార్చే
మోసగాళ్ల రాజ్యంలో...
మమ్మల్ని ఒంటరిగా వదిలేసి
అలా ఎలా వెళ్ళిపోతావయ్యా నువ్వు...
మతోన్మాదంపై సైద్ధాంతిక ఆయుధాన్ని
వజ్రాయుధంలా ప్రయోగించిన క్రియాశీలి
కార్మిక కర్షక పోరాటాల మార్గదర్శి
సైద్ధాంతిక వైఖరుల రూపశిల్పి
ఉద్యమాల రథసారథీ... ఏచూరి
అందుకో కామ్రేడా...మా నివాళి.
ఆశయం ఆచరణల సిద్ధాంతాన్ని
అంగీలా తొడుక్కుని
అరుణారుణ కాంతులను మా
గుండెల్లో
ఆరని జ్యోతుల్లా వెలిగించిన
సీతారామ్
నీకిదే మా లాల్ సలామ్.
రేపటి సంగ్రామానికి
నువ్విచ్చిన స్ఫూర్తే మాకు దీప్తి
విప్లవాల పవనం వీచినప్పుడు
ఉద్యమాల సంద్రం పొంగినప్పుడు
ఏ మేఘాల తెరలోనో
ఎగసిపడే అలల ఒడలోనో
ఓసారి వచ్చిపోవయ్యా...
మా నివాళులందుకోవయ్యా.

- రాజాబాబు కంచర్ల
సెల్ : 9490099231

కనిపించయ్యా ... ఒక్క తూరీ!

ప: సీతారాం ఏచూరీ- కనిపించయ్యా ... ఒక్క తూరీ!
మాకళ్ళే పొగచూరీ....ఎతుకుతున్నాం-ఏ మారీ!...
1. మొన్నే కదా ఎన్నికల్లో- అన్ని చోట్ల కలదిరిగావు
నిన్నే కదా పార్లమెంటులో- నిజాలతో మెప్పించావు
ఇంతలోనే ఏమైందీ?... చా-వెగరేసుకుపోయిందీ
గుండె గుభేలన్న మమ్ము- నీ నవ్వే ఓదార్చిందీ!
2. మనుషులంతా హాయిగా బతికే-మంచి మార్పు రావాలంటూ
సుందరయ్య, సూర్జిత్ దన్నుతో-ఎర్ర జెండా ఎత్తిపట్టి
జ్యోతిబసు కుడిభుజమయ్యి-జాతి గుండె చప్పుడయ్యి
మచ్చలేని మార్క్సిస్టుగా- మేధావిగా మెప్పించావు!
3. పార్టీలకు అతీతంగా- నేతలతో నేస్తం నెరిపావ్
పట్టు విడుపు చర్చలలో నువ్వు-లౌక్యపటిమ చూపించావు
కలిసిగట్టు పోరాటాలకు- కమ్యూనిస్టులను కూడేసి
ఉమ్మడి శత్రువు పైకి- ఉద్యమాలు ఉరికించావు!
4. తెలుగు బిడ్డ మా నేతని-తెగ సంబరపడిపోయాము
దేశద్రోహులను ఢీకొట్టే-ధీరుడొచ్చేనని మురిశాము
గడ్డు కాలాన పార్టీని-గట్టి దమ్ముతో నిలబెట్టావు
ఎర్రజెండా మా కందించి-కళ్ళ ఎదుటే కనుమరుగయ్యావ్!!
ప:సీతారాం ఏచూరీ- కనిపించయ్యా....ఒక్క తూరీ!
మా కళ్ళే పొగబారీ-ఎతుకుతున్నాం ఏ మారీ....
నీ బాటలో పయనిస్తాం!...నీ కలలను పండిస్తాం!....
ఎర్రజెండా అండ తోటి - నీ లక్ష్యం సాధిస్తాం!!....

- చైతన్య ప్రసాద్,
సెల్ : 98496 51451

కనుమూసిన వీరుడా... కామ్రేడా...

పల్లవి : కనుమూసిన వీరుడా... కమ్యూనిస్టు యోధుడా
కామ్రేడా సీతారామ్ ...అందుకో లాల్‌సలామ్
కనుమూసిన వీరుడా ఆ...కామ్రేడా సీతారామ్... 2 ॥కనుమూసిన॥
చరణం 1 విద్యార్థి జీవితాన ఉన్నత శిఖరాలను చేరి
నియంతల్ని నిలదీశావు - ఎమర్జెన్సీ నెదిరించావు
జెయన్‌యు నాయకునిగా జయకేతన మెగురేశావు 2॥కనుమూసిన॥
చరణం 2 సంపన్నుల ఇంట పుట్టి - సనాతన వాదం వదలి
శ్రమజీవికి పట్టం కట్టే సమరాజ్య కావాలంటూ
సామాన్యుల పక్షం చేరి - సమరం సాగించితివయ్యా 2॥కనుమూసిన॥
చరణం 3 మార్క్సిస్టు సిద్ధాంతాన్ని - మనసంతా నింపుకొని
దుర్మార్గపు పాలనను - దోపిడీని అంతం జేయ
ఎర్రజెండ నెత్తుకొని - ఎదిరించి పోరితివయ్యా
2॥కనుమూసిన॥
చరణం 4 ప్రపంచాన జరిగే మార్పులు - పాలకుల పన్నాగాలను
పార్లమెంటు లోపల జరిగే - కుట్రలను, కుతంత్రాలను
లోతైన విశ్లేషణతో - ధీటుగాను ఎదిరించావు
2॥కనుమూసిన॥
చరణం 5 మతోన్మాద మూకలను -మట్టుబెట్టే మార్గంచూపి
వామపక్ష శక్తులను - ఒక్కటిగా నిలిపావు
లౌకిక పార్టీలను - ఏకతాటి మీదకు తెచ్చిన
ఏచూరీ నీ త్యాగం - ఎన్నటికీ మరువదు లోకం
2॥కనుమూసిన॥
చరణం 6 ఆశయాలు క్లిష్టమైనా - అడుగు ముందుకేసే నైజం
సుందరయ్య మాకినేని - చూపినట్టి మార్గంలో
కడవరకూ నడిచావయ్యా - జనహృదిలో నిలిచావయ్య
2॥కనుమూసిన॥
చరణం 7 మన గమ్యం చేరువరకు - లక్ష్యం నెరవేరు వరకూ
మీరు చూపిన బాటలోనే - మేము నిరతం పయనిస్తాము.
2 ॥కనుమూసిన॥

- కంకణాల ఆంజనేయులు

ఉపాధి ఉసురు తీస్తున్న మోడీ సర్కార్

- భారీగా జాబ్ కార్డుల తొలగింపు
- సమస్యల చట్రంలో ఉపాధి కార్మికులు
- మూడేళ్లుగా ఏర్పాటు కాని ఉన్నత స్థాయి కమిటీ



న్యూఢిల్లీ : మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వివిధ రూపాల్లో కుట్రలు చేస్తోంది. బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ పథకానికి నిధులు తగ్గిస్తూ రావడం, డిజిటలైజేషన్ పేరుతో ఎనలేని సాంకేతిక చిక్కుముడులేయడం, సామాజిక తరగతుల వారీగా విభజన తీసుకొచ్చేందుకు ప్రయత్నించడం వెరసి అన్ని విధాలా గ్రామీణ ఉపాధి ఉసురు తీసే చర్యలు కొనసాగిస్తూనేవుంది. ఈ క్రమంలోనే జాబ్ కార్డుల తొలగింపు పెద్దఎత్తున కొనసాగుతోంది. మరోవైపు ఉపాధి ప్రాజెక్టులను పర్యవేక్షించి, అవసరమైన సూచనలు అందించాల్సిన కేంద్ర ఉపాధి గ్యారంటీ మండలిని (సిఇజిసి) గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ 2021 మే... అంటే మూడు సంవత్సరాల నుంచి ఏర్పాటు చేయనే లేదు. ఈ మండలికి గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి నేతృత్వం వహించాల్సి ఉంది. పంచాయతీరాజ్ సంస్థలు, కార్మిక సంఘాలు, ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన తరగతులకు చెందిన పదిహేను మంది వరకూ సభ్యులుగా ఉంటారు.

సిఇజిసి ఏర్పాటులో జరుగుతున్న తీవ్రమైన కాలయాపనను గమనిస్తే విమర్శలను వినే ఉద్దేశం ప్రభుత్వానికి లేనట్లు కన్పిస్తోందని పౌర సమాజ సంస్థ అయిన నరేగా సంఘర్ష్ మోర్చాకు (ఎన్ఎస్ఎం) చెందిన అశిష్ రంజన్ విమర్శించారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితులపై సిఇజిసి సభ్యులు సమాచారం అందజేస్తారు. కార్మికులకు ఏవైనా సమస్యలు ఎదురవుతున్నాయా అనే విషయాన్ని పరిశీలిస్తారు. సిఇజిసి ఏర్పాటులో జరుగుతున్న జాప్యాన్ని గమనిస్తే ఈ కార్యక్రమానికి సంబంధించి ఎలాంటి విమర్శలు వినే ఉద్దేశం ప్రభుత్వానికి లేనట్టుగా ఉంది' అని అశిష్ చెప్పారు. ఉపాధి పథకం సజావుగా సాగడంలో సిఇజిసి కీలకపాత్ర పోషిస్తుందని ఆయన తెలిపారు. పథకాన్ని మదింపు చేసి, కార్మికుల సమస్యలను సమీక్షించే అధికారం దానికి ఉన్నదని అన్నారు.

సిఇజిసి సిఫార్సులను ప్రభుత్వం విధిగా అమలు చేయనక్కరలేదని, కానీ మంత్రి నేతృత్వం వహిస్తున్నందున దానికి ప్రాధాన్యత ఉన్నదని ఆశిష్ చెప్పారు. కార్మికులు తమ హాజరును నమోదు చేయడానికి నేషనల్ మొబైల్ మానిటరింగ్ సర్వీస్ యాప్‌ను ప్రభుత్వం ప్రవేశపెట్టింది. అయితే అనేక ప్రాంతాలలో ఇంటర్నెట్ సదుపాయం సరిగా లేకపోవడంతో హాజరు నమోదు కావడం లేదు. తమ సంఘం ఇటీవలే గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో సమావేశమై సిఇజిసిని పునర్వ్యవస్థీకరించాలని డిమాండ్ చేసిందని అశిష్ తెలిపారు.

గత మూడు సంవత్సరాలలో ప్రభుత్వం ఉపాధి హామీ పథకం డాటాబేస్ నుంచి పెద్దఎత్తున జాబ్ కార్డుదారులను తొలగించింది. డూప్లికేట్ లేదా నకిలీ కార్డుల ఏరివేత ఎప్పుడూ జరిగే పనేనని ప్రభుత్వం సమర్ధించుకుంటోంది. 2022-23లో రాష్ట్ర ప్రభుత్వాలు ఐదు కోట్లకు పైగా జాబ్ కార్డులను తొలగించాయి. ఏటా సగటున కోటి నుంచి కోటిన్నర కార్డులు మాత్రమే తొలగిస్తుంటారు. దానితో పోలిస్తే 2022-23లో తొలగించిన కార్డుల సంఖ్య బాగా ఎక్కువే.

కార్డుల తొలగింపును వ్యతిరేకిస్తూ ఈ నెల 1 నుంచి 7వ తేదీ వరకూ ఎన్ఎస్ఎం దేశవ్యాప్తంగా పెద్దఎత్తున పోస్ట్ కార్డుల ఉద్యమాన్ని నిర్వహించింది. పశ్చిమ బెంగాల్‌కు ఉపాధి హామీ నిధుల నిలిపివేతను నిరసిస్తూ సంతకాల సేకరణ జరిపింది. 2006-11 మధ్యకాలంలో వేతన సవరణ, సామాజిక ఆడిట్ వంటి వివిధ అంశాలపై సిఇజిసి అర్ధవంతమైన పాత్ర నిర్వహించిందని అశిష్ గుర్తు చేశారు. అయితే కీలక అంశాలపై వేర్వేరుగా నిపుణుల కమిటీలను ప్రభుత్వం ఏర్పాటు చేయడంతో సిఇజిసి ప్రాధాన్యత తగ్గిందని తెలిపారు. ఇప్పుడు సిఇజిసి ఏర్పాటును జాప్యం చేయడం ద్వారా ప్రభుత్వం మరో అడుగు ముందుకు వేసిందని ఆయన విమర్శించారు. సిఇజిసిని ఎందుకు ఏర్పాటు చేయడం లేదని ప్రశ్నిస్తూ గ్రామీణాభివృద్ధి శాఖ కార్యదర్శి శైలేష్ కుమార్ సింగ్‌కు ఇ-మెయిల్ పంపినా ఇప్పటి వరకూ సమాధానం లభించలేదు.

ఎన్నికలే కాశ్మీర్ భవిష్యత్తును నిర్ణయిస్తాయి : మోడీ

జమ్మూ అండ్ కాశ్మీర్ : జమ్మూ అండ్ కాశ్మీర్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ రాష్ట్రంలో మూడు దశల్లో (సెప్టెంబర్ 18, 25, అక్టోబర్ 1 తేదీల్లో) జరగనున్నాయి. ఆ రాష్ట్రంలో దాదాపు పదేళ్ల తర్వాత ఎన్నికలు జరగనుండడంతో ఈ అసెంబ్లీ ఎన్నికలు కీలకంగా మారాయి. ఈ నేపథ్యంలో ప్రధాని మోడీ శనివారం జమ్మూకాశ్మీర్‌లో పర్యటించారు. ఈ ఎన్నికలే జమ్మూ కాశ్మీర్ భవిష్యత్తుని నిర్ణయిస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. శనివారం జమ్మూ అండ్ కాశ్మీర్‌లో దోడాలో జరిగిన బహిరంగ సభలో మోడీ మాట్లాడుతూ.. 'మేము జమ్మూ అండ్ కాశ్మీర్‌ని పర్యాటకులకు స్వర్గధామంగా, ఉగ్రవాద రహిత ప్రాంతంగా మార్చడానికి కట్టుబడి ఉన్నాము. జమ్మూ కాశ్మీర్ భవిష్యత్తులో గ్లోబల్ ఫిల్మ్‌కి అనుకూలంగా ఉంటుంది. ఇక్కడికి చేరుకోవాలనుకున్న వారికి త్వరలోనే ఢిల్లీ నుండి శ్రీనగర్‌కి నేరుగా రైలు ఉంటుంది' అని ఆయన అన్నారు.

పౌర హక్కుల నేతల అరెస్ట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలంలో ఈ నెల ఐదున జరిగిన ఎన్‌కౌంటర్‌పై నిజ నిర్ధారణకు వెళ్తున్న పౌర హక్కుల సంఘం అధ్యక్షులు ప్రొఫెసర్ లక్ష్మణ్, కార్యదర్శి నారాయణతో పాటు మరో 14 మందిని శనివారం ఉదయం మణుగూరు, అశ్వాపురం పోలీసులు వేర్వేరు చోట్ల అరెస్టు చేశారు. మణుగూరు బస్టాండ్, రైల్వే స్టేషన్‌తో పాటు అశ్వాపురంలో అదుపులోకి తీసుకున్న వారిని అశ్వాపురం పిఎస్‌కు తరలించారు. పోలీస్ స్టేషన్‌కు గేట్లు వేసి భారీ భద్రతా ఏర్పాటు చేశారు. లోపలికి మీడియాతో పాటు ఎవ్వరినీ అనుమతించలేదు. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం నేతలు మాట్లాడుతూ.. పౌర హక్కుల సంఘం నేతలను అరెస్టు చేసి, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడం దారుణమన్నారు. ప్రజాస్వామ్య ప్రభుత్వమని చెప్పిన ప్రభుత్వం.. ఎన్‌కౌంటర్ వాస్తవాలు తెలుసుకునేందుకు వెళ్తుంటే తమను అక్రమంగా నిర్బంధించడం దారుణమని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు రవి అన్నారు. అయితే, పౌర హక్కుల సంఘం నేతలను విచారించిన అనంతరం ప్రయివేట్ బస్సులో మరో ప్రాంతానికి తరలించారు. వారిని ఎక్కడికి తరలించారు అనే విషయాన్ని పోలీసులు గోప్యంగా ఉంచారు.

తాజ్ మహల్ ప్రధాన గోపురం నుంచి నీరు లీకేజీ



ఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీకి 250 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆగ్రాలో రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షం కారణంగా తాజ్ మహల్ వద్ద నీరు లీకేజీ అయింది. 17వ శతాబ్దపు సమాధికి ఆనుకుని ఉన్న తోట మునిగిపోయినప్పటికీ.. ప్రధాన గోపురానికి ఎటువంటి నష్టం జరగలేదు అని ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా తెలిపింది. ఇక, 17వ శతాబ్దానికి చెందిన తాజ్ మహల్ ప్రపంచంలోని ఏడు అద్భుతాలలో ఒకటిగా ఉంది. ఆగ్రా సర్కిల్‌కు చెందిన సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ రాజ్‌కుమార్ పటేల్ మాట్లాడుతూ.. తాము తాజ్ మహల్ ప్రధాన గోపురంలో నీటి లీకేజీని చూశాము.. కానీ తనిఖీ చేసినప్పుడు.. ప్రధాన గోపురంకు ఎటువంటి నష్టం జరగలేదన్నారు. డ్రోన్ కెమెరాను ఉపయోగించి ప్రధాన గోపురం మొత్తం తనిఖీ చేసామన్నారు.

ప్రధాన గోపురంలో నీటి లీకేజీని నిరంతరంగా పర్యవేక్షిస్తున్నట్లు ఆగ్రా సర్కిల్‌కు చెందిన సూపరింటెండింగ్ ఆర్కియాలజిస్ట్ రాజ్‌కుమార్ పటేల్ తెలిపారు. వరదలతో నిండిన మహల్ తోట దృశ్యాలు స్థానికులతో పాటు పర్యాటకులలో ఆందోళనలకు దారి తీశాయి. స్మారక చిహ్నంపై సరైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆగ్రాలో గురువారం 151 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.. గత 80 ఏళ్లలో 24 గంటల్లో అత్యధిక వర్షపాతం నమోదైంది అని చెప్పారు. జాతీయ రహదారి ఒకటి జలమయం కాగా, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొన్ని ప్రాంతాల్లో పంటలు నీట మునిగాయి.. ఆగ్రాలోని అన్ని పాఠశాలలను అధికారులు మూసివేయాలని ఆదేశాలు జారీ చేశారు.

ప్రసవం తర్వాత ఆరు వారాలకే

ఫిట్‌నెస్ ఎలా సాధ్యం?

- సిఎపిఎఫ్ మార్గదర్శకాలను సమీక్షించి తీరాలి
- కేంద్రాన్ని ఆదేశించిన ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ : కేంద్ర సాయుధ పోలీసు బలగాల (సిఎపిఎఫ్) మార్గదర్శకాలను సమీక్షించాల్సిందిగా కేంద్రాన్ని ఢిల్లీ హైకోర్టు ఆదేశించింది. గర్భం ధరించి, ప్రసవం తర్వాత తిరిగి బరువు తగ్గడానికి, మెడికల్ ఫిట్‌నెస్ పొందడానికి ఒక మహిళకు కేవలం ఆరు వారాల సమయం సరిపోదని హైకోర్టు పేర్కొంది. సిఎపిఎఫ్‌లో చేరాలనుకునే మహిళలకు కేవలం ఆరు వారాల గడువే ఇవ్వడం సరికాదని తెలిపింది. డెలివరీ అయి నాలుగు మాసాలే గడిచిన మహిళా అభ్యర్థికి జరిపిన వైద్య పరీక్షల్లో ఆమె బిఎంఐ 25 వుండాల్సిందిగా 25.3 వున్నందున ఆమెకు సిఎపిఎఫ్‌లో అవకాశం ఇవ్వడానికి తిరస్కరించారు. ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాలు వెలువడ్డాయి. పూర్తి స్థాయిలో మెడికల్ ఫిట్‌నెస్ పొందడానికి ఇచ్చిన ఆరువారాల గడువు చాలా తక్కువని జస్టిస్ రేఖా పల్లి, జస్టిస్ శైలేందర్ కౌర్‌లతో కూడిన బెంచ్ పేర్కొంది.

గ్రామీణ వేతనాల్లో స్తబ్దత నిజమే

న్యూఢిల్లీ : దేశంలో ఉద్యోగ కల్పన పరిస్థితి మెరుగుపడుతోందని, అయితే కుటుంబంలో జీతం భత్యం లేకుండా పనిచేసే వారి (అన్‌పెయిడ్ ఫ్యామిలీ లేబర్ - యూఎఫ్ఎల్) సమస్యలను పట్టించుకోకపోతే పరిస్థితి మళ్లీ మొదటికి వస్తుందని ప్రముఖ ఆర్థికవేత్త, బాత్ యూనివర్సిటీ విజిటింగ్ ప్రొఫెసర్ సంతోష్ మెహ్రోత్రా అభిప్రాయపడ్డారు. యూఎఫ్ఎల్ సమస్యను పరిగణనలోకి తీసుకోకపోతే దేశంలో ఉద్యోగ కల్పన వెనకపట్టు పడుతుందని ఆయన తెలిపారు. సెంటర్ ఫర్ సోషల్ ఎకనమిక్ ప్రోగ్రెస్ (సీఎస్ఈపీ) ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ప్రసంగిస్తూ ప్రభుత్వం, ఆర్‌బీఐ అందించిన ఉద్యోగ సమాచారం లోపభూయిష్టంగా ఉన్నదని, దానిని మదింపు చేయాల్సిన అవసరం ఉన్నదని చెప్పారు.



సెంటర్ ఫర్ సోషల్ ఎకనమిక్ ప్రోగ్రెస్ (సిఎస్ఇపి) ఇటీవలి సదస్సులో సూర్జిత్ భల్లా, మాంటెక్ సింగ్ అహ్లువాలియా, సంతోష్ మెహ్రోత్రా

ఆర్‌బీఐ సమాచారాన్ని మెహ్రోత్రా పరిశీలించారు. 2022-23 నివేదికలోని వృద్ధి గణాంకాలను ఆయన సవాలు చేశారు. 'గత మూడు నాలుగు సంవత్సరాలలో ఎనిమిది కోట్ల మందికి ఉపాధి లభించిందని ఆర్‌బీఐ చెబుతోంది. ఆ సమాచారం ప్రశ్నార్థకంగా ఉంది. తూర్పు ఆసియా, దక్షిణాసియాలో గత కొన్ని సంవత్సరాలుగా ఉపాధి కల్పన స్తబ్ధుగా ఉన్నదని అంతర్జాతీయ కార్మిక సంస్థ చెబుతుంటే భారత్‌లో ఎలా పెరుగుతుంది?' అని ప్రశ్నించారు. గత మూడు సంవత్సరాల కాలంలో ఉపాధి రూ. 54 కోట్ల నుంచి రూ.57 కోట్లకు మాత్రమే పెరిగిందని పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) చెప్పిందని ఆయన గుర్తు చేశారు. ఉపాధి కల్పనలో వ్యవస్థాగత మార్పులను ఆర్‌బీఐ పట్టించుకోలేదని తెలిపారు. మహిళలు... ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వారు వ్యవసాయ పనులు చేసుకుంటున్నారని, స్వయం ఉపాధిని పొందుతున్నారని ఆర్‌బీఐ నివేదిక చెప్పిందని అంటూ మహిళల భాగస్వామ్యం పెరగడం సానుకూల సంకేతమన్న ప్రభుత్వ వాదనను ఆయన సవాలు చేశారు. 2004 నుంచి మహిళలు వ్యవసాయ రంగాన్ని విడిచిపెడుతున్నారని చెప్పారు.

కుటుంబంలో జీతభత్యం లేకుండా పనిచేస్తున్న మహిళల సంఖ్య 2018-19లో 5.5 కోట్లు ఉండగా 2022-23 నాటికి 9.5 కోట్లకు పెరిగిందని, యూపీఏ హయాంతో పోలిస్తే ఎన్డీఏ పాలనలోనే తొలిసారి ఉపాధి కల్పన పడిపోయిందని మెహ్రోత్రా చెప్పారు. అయితే ప్రధాని ఆర్థిక సలహా మండలి మాజీ సభ్యుడు సుర్జిత్ భల్లా ఈ అభిప్రాయంతో విభేదించారు. యూఎఫ్ఎల్ పెరుగుతోందని అంటూనే మొత్తం కార్మికులలో దాని శాతం తగ్గుతోందని ఆయన చెప్పారు. అందుకు ఆయన పీఎల్ఎఫ్ఎస్ సమాచారాన్ని ఉటంకించారు. భారత్‌కు వ్యవసాయేతర ఉద్యోగాల అవసరం అధికంగా ఉన్నదని మెహ్రోత్రా చెప్పగా రంగంతో నిమిత్తం లేకుండా ఉపాధి కల్పన పెరగాలని భల్లా సూచించారు. కార్మికుల కొరత కారణంగానే దేశంలో ఉపాధి కల్పన తగ్గుతోందని ఆయన చెప్పారు.

ఈ ఇరువురు ఆర్థికవేత్తలు ఒక విషయంలో మాత్రం ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన కార్మికుల వాస్తవ వేతనాలు ఎదుగుబొదుగూ లేకుండా స్తబ్ధుగా ఉన్నాయని వారు తెలిపారు. నెలవారీ జీతాలు తీసుకునే గ్రామీణ ఉద్యోగుల వాస్తవ వేతనాలు 2018 నుంచి అలాగే ఉన్నాయని మహ్రోత్రా చెప్పారు. ఈ అభిప్రాయంతో భల్లా ఏకీభవించారు. అయితే ఇది కేవలం భారత్‌కు మాత్రమే పరిమితం కాదని ఆయన చెప్పారు. వాస్తవ వేతనాలలో పెరుగుదల లేకపోయినా తగ్గకపోవడాన్ని ఊరటగా భల్లా చెప్పుకొచ్చారు.

ఫైళ్లన్నీ హిందీలోనే !

- అమిత్ షా

న్యూఢిల్లీ : కేంద్ర హోంమంత్రిత్వ శాఖలో ఫైళ్లన్నీ పూర్తిగా హిందీలోనే ఉండేలా చర్యలు తీసుకుంటామని ఆ శాఖ మంత్రి అమిత్ షా చెప్పారు. 75వ అఖిల భారతీయ రాజ్‌భాషా సమ్మేళన్‌లో ఆయన మాట్లాడారు. భారతీయ భాషల సెక్షన్ (బిబిఎ)ను ఆయన ప్రారంభించారు.

విచ్ఛిన్నవాద ట్రంప్‌తో ప్రజలు విసిగి పోయారు !

- మీడియాతో కమలా హారిస్

వాషింగ్టన్ : అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ విద్వేష, విచ్ఛిన్నవాదాలతో ప్రజలు విసుగెత్తిపోయారని డెమోక్రాట్ అభ్యర్థి కమలా హారిస్ తెలిపారు. దేశాధ్యక్షుడు బైడెన్ కన్నా తాను భిన్నమని, దేశానికి కొత్త తరం నాయకత్వం అవసరమని ఆమె చెప్పారు. డెమోక్రాట్ అభ్యర్థిగా నామినేట్ అయిన తర్వాత శుక్రవారం తన మొదటి టెలివిజన్ ఇంటర్వ్యూలో కమలా హారిస్ పలు అంశాలపై మాట్లాడారు. ట్రంప్ వ్యక్తం చేస్తున్న విద్వేషం, విచ్ఛిన్నవాదాలను ఆమె తీవ్రంగా విమర్శించారు. ఆయన నాయకత్వ తీరు పట్ల ప్రజలు విసుగు చెందారని పేర్కొన్నారు. తుపాకుల వంటి మారణాయుధాలను కలిగి వుండడంపై నిషేధం వుండాలని తాను విశ్వసిస్తున్నట్లు చెప్పారు. బైడెన్ కన్నా భిన్నంగా వుండే అంశాల గురించి చెప్పాలని టివి యాంకర్ కోరిన నేపథ్యంలో "నేను జో బైడెన్‌ను కాను. కొత్త తరం నాయకత్వాన్ని అందించాలనుకుంటున్నా'నని హారిస్ చెప్పారు. 21వ శతాబ్దం సామర్ధ్యాన్ని సంపాదించేందుకు, అలాగే సవాళ్ళను ఎదుర్కొనడానికి రాబోయే పది, ఇరవై ఏళ్ళలో మనం చేయాల్సిన పనులేమిటి అనే అంశంపై ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించనున్నట్లు హారిస్ చెప్పారు. పెన్సిల్వేనియాలో ఎన్నికల ప్రచారానికి వెళ్ళిన నేపథ్యంలో ఈ ఇంటర్వ్యూ నిర్వహించారు.

సాధారణ స్థితికి గోదావరి

- ప్రమాద హెచ్చరికలన్నీ ఉపసంహరణ

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

గోదావరి నీటి మట్టం శనివారం నాటికి సాధారణ స్థితికి చేరుకుంది. దీంతో, అన్ని ప్రమాద హెచ్చరికలనూ అధికారులు ఉపసంహరించుకున్నారు. కాటన్ బ్యారేజీ వద్ద శుక్రవారం రాత్రికి 11.90 అడుగులున్న నీటిమట్టం అర్ధరాత్రి ఒంటి గంట తరువాత 11.70 అడుగులకు చేరుకుంది. దీంతో అప్పటి వరకూ అమల్లో ఉన్న మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించుకున్నారు. శనివారం 10.30 అడుగులకు చేరుకుంది. ప్రస్తుతం కాటన్ బ్యారేజీ నుంచి 7.81 లక్షల క్యూసెక్కుల నీటిని అధికారులు విడుదల చేస్తున్నారు. సాగు, తాగు నీటి అవసరాల నిమిత్తం తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టా కాలువలకు 12,700 క్యూసెక్కులు విడిచిపెడుతున్నారు. భద్రాచలం వద్ద 38.90 అడుగుల నీటిమట్టం నమోదైంది.

టెట్, డిఎస్‌సిలో ఉచిత కోచింగ్

- కెవిపిఎస్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్టడీ సర్కిళ్లలో టెట్, డిఎస్‌సిపై ఉచిత కోచింగ్ ఇవ్వాలని కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆండ్ర మాల్యాద్రి కోరారు. దీనిపై సాంఘిక సంక్షేమశాఖ డైరెక్టర్ లావణ్యవేణికి వినతిపత్రం సమర్పించారు. అంబేద్కర్, జ్యోతిబాపూలే పేరుతో స్టడీ సర్కిళ్లు ఏర్పాటు చేసి దళిత, గిరిజన, మైనార్టీ వర్గాల నిరుద్యోగ, యువతీ యువకులకు పోటీ పరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు విజయవాడ, విశాఖ, తిరుపతి, ఏలూరులో సొంత భవనాలు కూడా ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వం శిక్షణను నిర్లక్ష్యం చేసిందని, ఈ ప్రభుత్వమైనా వెంటనే జోక్యం చేసుకుని టెట్, డిఎస్‌పిపై ఉచిత శిక్షణ ఇప్పించాలని ఆయన కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలన్నారు. ప్రతి సంవత్సరం శిక్షణ క్యాలండర్ ఉండాలని, నాణ్యత పెంచే ప్యానల్ ఫ్యాకల్టీ ఉండాలని కోరారు. అన్ని రకాల పుస్తకాలతో కూడిన లైబ్రరీ ఏర్పాటు చేయాలన్నారు. నిరుద్యోగ యువతీ యువకులను పోటీ పరీక్షల ద్వారా ఎంపిక చేసి స్టయిఫండ్ ఇవ్వాలని కోరారు.

జగన్ పాలనే రాష్ట్రానికి అతి పెద్ద విపత్తు

- మంత్రి నాదెండ్ల మనోహర్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనే రాష్ట్రానికి అతిపెద్ద విపత్తు అని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. మంగళగిరి జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వైసిపి పాలనలో అన్నమయ్య డ్యామ్ కొట్టుకుపోవడాన్నే మేన్‌మేడ్ డిజాస్టర్ అంటారని తెలిపారు. విపత్తు సమయంలో కనీసం సాయం అందించని జగన్‌మోహన్‌రెడ్డి కేవలం రాజకీయ విమర్శలకు పరిమితమవుతున్నారని, ఇకనైనా వరద రాజకీయాలు మానుకోవాలని అన్నారు. వరదల మూలంగా నష్టపోయిన ప్రతి ఒక్కరినీ ఆదుకునేందుకు నష్టం లెక్కలు వేస్తున్నామన్నారు. బుడమేరు, ఏలేరు రిజర్వాయర్ ఆధునీకరణకు పకడ్బందీ ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని చెప్పారు. ఏలేరు ఆధునీకరణకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఇప్పటికే వెయ్యి కోట్ల అంచనాలతో ప్రణాళికలు సిద్ధం చేయించారని తెలిపారు. వైసిపిపాలనలో 2020 నుంచి రైతులకు పంటల బీమాకు రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. విపత్తు సమయంలో పవన్ కల్యాణ్ తన సొంత నిధులను రూ.4 కోట్లు వరదల్లో చిక్కుకున్న 400 గ్రామ పంచాయతీలకు ఇవ్వడమే కాకుండా రెండు తెలుగు రాష్ట్రాలకు చెరో కోటి వంతున సహాయం అందించాయని తెలిపారు. విపత్తులతో నష్టపోయిన బాధితులను నూటికి నూరు శాతం ఆదుకుంటామని చెప్పారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ పి.హరిప్రసాద్, జనసేనపార్టీ కార్యక్రమాల నిర్వహణ కమిటీ కన్వీనర్ కల్యాణం శివశ్రీనివాస్, పార్టీ రాష్ట్ర కార్యదర్శి మండలి రాజేష్ పాల్గొన్నారు.

మళ్లీ చర్చిద్దాం... విధులకు హాజరు కండి

- పిహెచ్‌సి డాక్టర్లకు ఆరోగ్య కుటుంబ సంక్షేమ కమిషనర్ విజ్ఞప్తి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

గ్రామీణ ప్రజల ఆరోగ్య సేవలకు విఘాతం కలిగించొద్దని, విధులకు హాజరై ప్రభుత్వానికి సహకరించాలని ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ కమిషనరు సి.హరికిరణ్ కోరారు. పిహెచ్‌సి డాక్టర్ల సమస్యల్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుందని, అసోసియేషన్ ప్రతినిధులని మరోసారి చర్చలకు ఆహ్వానిస్తామని ఆయన తెలిపారు. ఈనెల 13న ఎపి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల డాక్టర్ల అసోసియేషన్ ప్రతినిధులను సమావేశానికి పిలిపించి, వారి సమస్యలపై చర్చించినట్లు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం తరపున వైద్య ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటి కృష్ణబాబు అధ్యక్షతన ఈ సమావేశం జరిగినట్లు ఆయన తెలిపారు. చర్చల సందర్భంగా పిజి సీట్ల భర్తీలో ఇన్ సర్వీస్ కోటాను కుదిస్తూ ఇచ్చిన జిఒ నెంబరు 85పై చర్చించినట్లు పేర్కొన్నారు. 2020 బ్యాచ్ డాక్టర్ల నోషనల్ ఇంక్రిమెంట్లు, పిహెచ్‌సిల్లో పనిచేస్తున్న డాక్టర్లకు పదోన్నతులు, గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న డాక్టర్లకు అలవెన్సుల మంజూరు వంటి సమస్యల్ని ప్రభుత్వం దృష్టికి ప్రతినిధులు తీసుకొచ్చారన్నారు. సమావేశంలో చర్చించిన విషయాలపై ఒక నిర్ణయం తీసుకుంటామని ఎమ్‌టి కృష్ణబాబు తెలిపారని పేర్కొన్నారు.

కళ్ల ముందే కుళ్లుతున్న పంట

- అప్పులు చేసి పెట్టిన పెట్టుబడులను ఊడ్చేసిన వరద
- ధీనావస్థలో కౌలు రైతులు



పిఠాపురం మండలం అగ్రహారంలో వరదల కారణంగా కుళ్లిన పంటను చూపుతున్న బాధిత రైతు

ప్రజాశక్తి- కాకినాడ ప్రతినిధి

ఏలేరు వరదలకు రైతాంగం పెద్ద ఎత్తున నష్టపోయింది. వీరిలో ఎక్కువగా కౌలు రైతులే ఉన్నారు. అప్పులు చేసి పెట్టిన పెట్టుబడులను ఏలేరు వరద ఊడ్చేసింది. ఈ ఖరీఫ్ సీజన్లో రెండుసార్లు భారీ వర్షాలు, వరదలు ముంచెత్తడంతో కౌలు రైతులు పూర్తిగా నష్టపోయారు. మరికొద్ది రోజుల్లో చేతికందే పంట వరద నీటిలో మునిగిపోయింది. వారం రోజులుగా పంట పూర్తిగా నీటిలోనే ఉండడంతో కుళ్లిపోతోందంటూ కౌలు రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేకమందికి కౌలు గుర్తింపు కార్డులు నేటికీ అందలేదు. ఇ-క్రాప్ బుకింగ్ సైతం చాలామందికి అవ్వకపోవడంతో వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.

అప్పులే మిగిలాయి

కాకినాడ జిల్లాలో పంటలను సాగు చేస్తున్న వారిలో 80 శాతం మంది కౌలు రైతులే ఉన్నారు. జిల్లాలో సుమారు 1.50 లక్షల మంది కౌలు రైతులు ఉన్నట్లు అంచనా. 2019లో ప్రభుత్వం తీసుకొచ్చిన కౌలు రైతు చట్టంతో వీరికి అన్యాయం జరుగుతోంది. కార్డు ఇవ్వాలంటే భూ యాజమాని సంతకం తప్పనిసరి కావడంతో చాలామంది కౌలు రైతులకు అన్యాయం జరుగుతోంది. ఏలేరు వరదలకు అధికారుల లెక్కల ప్రకారం 62 వేల ఎకరాల్లో పంటలు తుడుచుపెట్టుకుపోయాయి. 35 వేల మంది రైతులు నష్టపోయారు. వీరిలో 23 వేలకుపైగా కౌలు రైతులే ఉన్నారు. వీరు కౌలుకు తీసుకున్న భూమికి ఎకరాకు రూ.30 నుంచి రూ.35 వేలు శిస్తు చెల్లించేలా యజమానులతో ఒప్పందం చేసుకుని సాగు చేపట్టారు.

అరకొరగా సిసిఆర్‌సి కార్డులు

కౌలు రైతుకు ఏ సాయం అందాలన్నా సిసిఆర్‌సి కార్డుతో ముడిపెట్టడంతో వీరు అన్యాయానికి గురవుతున్నారు.

జిల్లాలో ఈ ఏడాది 68,890 మందికి కార్డులు ఇవ్వాలని అధికారులు లక్ష్యంగా తీసుకున్నారు. ఇప్పటి వరకూ 58 వేల మందికి మాత్రమే ఇచ్చారు. వరదల వల్ల పంటలను కోల్పోయిన 23 వేల మంది కౌలు రైతుల్లో సుమారు నాలుగు వేల మందికి మాత్రమే కార్డులు ఉన్నాయి. మిగిలిన 19 వేల మందికీ కార్డులు అందలేదు.

అప్పులు తీర్చేదెలా?

ఐదు ఎకరాలు కౌలుకు సాగు చేశాను. ఏలేరు వరద ముంచెత్తడంతో పంట పూర్తిగా నాశనమైంది. ఎకరాకు రూ.35 వేల వరకు పెట్టుబడి పెట్టాను. ఎకరాకు రూ.36 వేలు కౌలు చెల్లించాల్సి ఉంది. భూ యజమాని సంతకం పెట్టకపోవడంతో సిసిఆర్‌సి కార్డు రాలేదు. ప్రభుత్వం అందించే పరిహారం అందుతుందో, లేదో తెలియడం లేదు.

- కొయ్య వీరబాబు, కౌలు రైతు, వీరరాఘవపురం, పిఠాపురం మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి

మూడున్నర ఎకరాలు కౌలుకు సాగు చేసి పెట్టిన పెట్టుబడంతా వరద పాలైంది. మరో 40 రోజుల్లోనే పంట చేతికి అందే అవకాశం ఉంది. ఈలోపు వరద వల్ల నష్టం జరిగిపోయింది. నాకు సిసిఆర్‌సి కార్డు ఇవ్వలేదు. ప్రభుత్వం వాస్తవ సాగుదారులను గుర్తించి ఎకరాకు కనీసంగా రూ.25 వేలు పరిహారం అందించి ఆదుకోవాలి.

- సిహెచ్.త్రిమూర్తులు, కౌలు రైతు, రాపర్తి, పిఠాపురం మండలం



లక్ష్మీదేవమ్మ భౌతికకాయం వద్ద మాట్లాడుతున్న మల్లు లక్ష్మి

లక్ష్మీదేవమ్మకు తుది వీడ్కోలు

- మెడికల్ కాలేజీకి భౌతికకాయం అప్పగింత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లక్ష్మీదేవమ్మ మరణం మహిళా ఉద్యమాలతోపాటు కమ్యూనిస్టు పార్టీకి, ఆమె కుటుంబానికి తీరని లోటని ఐద్వా తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. ఐద్వా సీనియర్ నాయకురాలు లక్ష్మీదేవమ్మ శుక్రవారం హైదరాబాద్‌లో సొంతింట్లో కన్నుమూసిన విషయం విదితమే. శనివారం సిపిఎం నాయకులు, ప్రజాసంఘాల నేతలు నివాళి అర్పించిన అనంతరం.. మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి భౌతికకాయాన్ని మహబూబ్‌నగర్‌కు తీసుకొచ్చారు. టుటౌన్ నుంచి సిపిఎం కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రజల సందర్శనార్థం భౌతికకాయాన్ని పార్టీ కార్యాలయంలో కొద్దిసేపు ఉంచారు. అక్కడే సంతాప సభ నిర్వహించారు.

మల్లు లక్ష్మి మాట్లాడుతూ.. లక్ష్మీదేవమ్మ ఒక కమ్యూనిస్టు కార్యకర్తగా, మహిళా ఉద్యమ నాయకురాలిగా ఒక మంచి కుటుంబాన్ని తయారు చేయడంలో ఆమె పాత్ర పోషించారన్నారు. మహిళా ఉద్యమాలు నడుపుతూనే పాలమూరులో 16 అంబలి కేంద్రాలు నిర్వహించారని అన్నారు. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి, యుటిఎఫ్ నాయకులు మోత్కూరి నరహరి, ఐద్వా నాయకులు అరుణజ్యోతి, ఆశాలత, ప్రజాశక్తి అసిస్టెంట్ ఎడిటర్ కె గడ్డెన్న, సిపిఎం, రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు. సాయంత్రం ఐదు గంటలకు లక్ష్మీదేవమ్మ భౌతికకాయాన్ని కుమారులు అర్జున్, డాక్టర్ ఉదయ్‌కుమార్, కుటుంబీకుల సమక్షంలో మహబూబ్‌నగర్ ప్రభుత్వ మెడికల్ కాలేజీకి అప్పగించారు.

సిబిఎస్‌ఈ పాఠశాలల్లో విద్యాప్రమాణాలు ఆందోళనకరం

- నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ప్రభుత్వ ఉత్తర్వులు 31లో పేర్కొన్న విధంగా 1000 సిబిఎస్‌ఇ అఫిలియేటెడ్ పాఠశాలల్లో విద్యార్థుల ప్రమాణాలు ఆందోళన కలిగిస్తున్నాయని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేశారు. విద్యాప్రమాణాలు తగ్గాయని చెబుతూనే అవే సిలబస్, అవే పాఠ్యపుస్తకాలు, అదే బోధన వల్ల ఉత్తీర్ణత ప్రమాణాలు ఎలా పెరుగుతాయని ప్రశ్నించారు. సిడిఎస్‌ఈ బోధనకు రాష్ట్ర పరీక్షా విధానానికి తేడా ఉన్నట్లు ప్రభుత్వం పేర్కొనడం పదవ తరగతి పరీక్ష విధానం తక్కువ ప్రమాణాలతో ఉందన్న సంకేతాలు వెళ్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. దీనిపై వెంటనే దిద్దుబాటు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ ఏడాది నుండే సిబిఎస్‌ఈలో విద్యార్థుల బోధన కల్పించేందుకు అసవరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. సిబిఎస్‌ఈ నుండి వెనక్కు తగ్గితే మన రాష్ట్ర విద్యాబోధనపై ఇతర రాష్ట్రాల్లో చిన్నచూపు ఉండే అవకాశం ఉందని వారు తెలిపారు. ప్రాథమికోన్నత పాఠశాలల్లో ఆరు నుండి ఎనిమిది తరగతులకు సబ్జెక్టు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలని వారు కోరారు.

విజయవాడ వరదలపై పిల్

ప్రజాశక్తి-అమరావతి

విజయవాడ వరద బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందంటూ ఒంగోలుకు చెందిన విశ్రాంత జర్నలిస్ట్ నాతాని భూపతి రావు హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. వరదల నివారణ, వరదలను ఎదుర్కోవడం, బాధితుల పునరావాసం, ఆహార సరఫరా వంటివి చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని, బుడమేరు నుంచి నీటి విడుదల సమయంలో ప్రజలను ముందుగా అప్రమత్తం చేయలేదని పిల్‌లో పేర్కొన్నారు. బుడమేరుతోపాటు కృష్ణా నదిని ఆనుకుని జరిగిన ఆక్రమణల తొలగింపునకు ఉత్తర్వులివ్వాలని, నిర్లక్ష్యానికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇందులో ప్రతివాదులుగా కేంద్ర హోం, ఎర్త్ సైన్సెస్, అటవీ, పర్యావరణ శాఖల కార్యదర్శులను, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, జల వనరుల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి, జల వనరుల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్‌లను చేర్చారు. సిఎం చంద్రబాబును వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా చేర్చారు.

తెలియదు, గుర్తు లేదు

- టిడిపి కార్యాలయంపై దాడి కేసులో విచారణకు హాజరైన వైసిపి నేతలు
- పాసుపోర్టులు అప్పగించిన లేళ్ల, తలశిల, అవినాష్, జోగి



విచారణకు హాజరైన వైసిపి నాయకులు లేళ్ల, తలశిల, అవినాష్

ప్రజాశక్తి-మంగళగిరి రూరల్ (గుంటూరు జిల్లా)

'తెలియదు. తాము దాడి జరిగిన రోజు లేము. గుర్తుకు రావడం లేదు' అని మంగళగిరి టిడిపి కార్యాలయంపై దాడి కేసులో విచారణకు హాజరైన వైసిపి నేతలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, దేవినేని అవినాష్ సమాధానం చెప్పినట్టు తెలిసింది. అప్పటి సిఎం జగన్‌ను విమర్శించినందుకు కొంతమంది కార్యకర్తలు టిడిపి ఆఫీసుపై దాడి చేసినట్టు తెలుసునని, తాము ఎప్పుడు ప్రత్యక్షంగా దాడుల్లో పాల్గొనలేదని విచారణలో ముగ్గురు నేతలు వెల్లడించినట్టు సమాచారం. టిడిపి కార్యాలయంపై దాడి కేసులో సుప్రీంకోర్టులో ముందస్తు బెయిల్ పొందిన వైసిపి నాయకులకు మంగళగిరి రూరల్ పోలీసులు 41ఏ కింద విచారణకు రావాలని నోటీసులు జారీ చేశారు. ఈ మేరకు వీరు శనివారం సాయంత్రం మూడు గంటల ప్రాంతంలో విచారణకు వచ్చారు. రాత్రి 8.45 వరకు విచారణ కొనసాగింది. కోర్టు ఆదేశాలతో ఈ ముగ్గురు నేతలు తమ పాస్‌పోర్టులను పోలీసులకు అప్పగించారు. దాడి ఘటనపై ముగ్గురిని వేర్వేరుగా విచారణకు పిలిచారు. నిందితుల తరపున విజయవాడ న్యాయవాది బొగ్గు గవాస్కర్ హాజరయ్యారు.

విచారణ అనంతరం మీడియాతో మాట్లాడకుండా ముగ్గురు కలసి కారులో వెళ్లిపోయారు. వీరి వెంట మాజీ మంత్రి మేరుగ నాగార్జున ఉన్నారు. చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో మాజీమంత్రి జోగి రమేష్ కూడా విచారణకు హాజరు అయ్యారు. జిల్లా అదనపు ఎస్‌పి కొల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళగిరి డిఎస్‌పి మురళీకృష్ణ వీరిని విచారించారు. విచారణ సందర్భంగా మంగళగిరిలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఆదాయం పెంచి అక్రమార్కుల పనిపడతాం

- ఎక్సైజ్ అధికారుల సంఘ నేతలు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో:

ఎక్సైజ్‌శాఖకు ఆదాయం పెంచి అక్రమార్కుల పనిపడతామని రాష్ట్ర ఎక్సైజ్ విభాగం ఎగ్జిక్యూటివ్ అధికారుల సంఘం అధ్యక్షులు బి నరసింహులు తెలిపారు. ఎక్సైజ్ శాఖ పునరుద్ధరణ అంశంపై పూర్తిస్థాయి ఉత్తర్వుల విడుదలైన సందర్భంగా విజయవాడలోని ఎక్సైజ్ ఆఫీసులో సిఎం చంద్రబాబునాయుడు, మంత్రి కొల్లు రవీంద్ర చిత్రపటాలకు శనివారం క్షీరాభిషేకం చేశారు. గత ప్రభుత్వం ఎటువంటి అధికారాలు లేకుండా ఏర్పాటు చేసిన సెబ్ విభాగం వల్ల తమ కంటే ఎక్కువగా ప్రజల ఆరోగ్యానికి, ప్రభుత్వ ఆదాయానికి నష్టం జరిగిందన్నారు. గంజాయి అమ్మకాలలో పెరుగుదల, ఇసుక అక్రమ రవాణా పెరిగాయని చెప్పారు. 2019కి ముందు రాష్ట్రంలో అక్రమ మద్యం నిల్వలు, గంజాయి అమ్మకాలను గణనీయస్థాయికి తగ్గించగలిగామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు కామేశ్వరరావు, వివిఎస్ఎస్ఎన్ వర్మ, ఆర్‌వి రామశివ తదితరులు పాల్గొన్నారు.

గుజరాత్‌లో గ్లోబల్ రెన్యూవబుల్ ఎనర్జీ ఇన్వెస్టర్స్‌మీట్

- మూడు రోజుల పాటు నిర్వహణ
- హాజరు కానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కేంద్ర నూతన, పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ ఆధ్వర్యాన గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఈ నెల 16 నుంచి 18 నుంచి 4వ గ్లోబల్ రెన్యూవబుల్ ఎనర్జీ ఇన్వెస్టర్స్ మీట్, ఎక్స్‌పో (ఆర్ఇ-ఇన్వెస్ట్ 2024) జరుగుతుందని ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె విజయానంద్ తెలిపారు. గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టులపై విద్యుత్ సంస్థల అధికారులతో శనివారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఇన్వెస్టర్స్ మీట్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పాల్గొంటారని ఈ సమావేశంలో వెల్లడించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోడీతో పాటు ఆస్ట్రేలియా, డెన్మార్క్, జర్మనీ, నార్వే ఇతర అంతర్జాతీయ, జాతీయ సంస్థల నుంచి విదేశీ ప్రతినిధులు, పెట్టుబడిదారులు ఈ సదస్సులో పాల్గొంటారని వివరించారు. రాష్ట్ర విద్యుత్ డిమాండ్ 2030 నాటికి 1,15,067 మిలియన్ యూనిట్లు(ఎంయు)లు దాటుతుందని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. పెరుగుతున్న ఈ డిమాండ్‌ను అందుకోవడానికి రాష్ట్రప్రభుత్వం 2030 నాటికి రెన్యూవబుల్ ఎనర్జీ సామర్థ్య పెంపునకు(సోలార్,విండ్, హైడ్రో, బయో ఎనర్జీ) దశలవారీగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో భారీ పునరుత్పాదక ఇంధన సామర్థ్యం, పెట్టుబడదారులకు అనుకూలమైన ప్రభుత్వ విధానాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరుల లభ్యత, పారిశ్రామిక పార్కులు, స్పెషల్ ఎకనామిక్ జోన్లు, ప్రధాన మౌలిక సదుపాయాలు, రైల్ కనెక్టివిటీ, సింగిల్ విండో క్లియరెన్సులు వంటి అనుకూలమైన అవకాశాలు పెట్టుబడులు పెట్టేందుకు ఉన్నాయని తెలిపారు. అంతర్జాతీయ పెట్టుబడిదారులను ఆకర్షించేందుకు ఈ సదస్సు గొప్ప అవకాశమని పేర్కొన్నారు. రాష్ట్రంలో 38.5 గిగావాట్ల సోలార్ విద్యుత్, 123.34 గిగావాట్ల పవన్ విద్యుత్, 43.89 గిగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టుల ద్వారా పునరుత్పాదక ఇంధన ప్రాజెక్టుల స్థాపనకు అవకాశం ఉందని వివరించారు. రాష్ట్రంలో గ్రీన్ ఎనర్జీ ప్రాజెక్టుల ఏర్పాటుకు ప్రపంచ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్రానికి ఉన్న వనరులను, ఇంధన రంగంలో రాష్ట్ర సామర్థ్యాన్ని వివరిస్తామని పేర్కొన్నారు.

17 నుంచి స్వచ్ఛతా హి సేవ

- స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎండి గంధం చంద్రుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్వచ్ఛ భారత్ దినోత్సవం సందర్భంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా స్వచ్ఛతాహి సేవ-2024 నిర్వహిస్తున్నామని స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఎమ్‌డి గంధం చంద్రుడు చెప్పారు. రాష్ట్రస్థాయిలో భాగస్వామ్య సంస్థలతో శనివారం ఉన్నతస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రుడు మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్ పదో వార్షికోత్సవం, స్వచ్ఛతా హి సేవా కార్యక్రమం ఏడు వసంతాలు పూర్తిచేసుకున్న తరుణంలో ఈ కార్యక్రమం ముఖ్యమైన మైలురాయిగా నిలిచిపోతుందన్నారు. రాష్ట్రమంతటా పరిశుభ్రతకు సంబంధించిన కార్యకలాపాల్లో సమిష్టి కార్యాచరణ, పౌరులలో భాగస్వామ్య స్ఫూర్తిని పునరుద్ధరించటమే ధ్యేయంగా ముందడుగు వేస్తున్నామని తెలిపారు. ఈ పదిరోజులు ఒక్కో కార్యక్రమాన్ని నిర్వహించాలని పేర్కొన్నారు.



రాధానగర్‌లో వరద బాధితులకు భోజనం వడ్డిస్తున్న బాబూరావు, తదితరులు

మరో రెండు ఆహార కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి - విజయవాడ : సిపిఎం ఆధ్వర్యంలో నిరాటకంగా ఆహార పంపిణీ కేంద్రాలు నడుస్తున్నాయి. వరద బాధితుల ఆకలి తీర్చేందుకు మరో రెండు కేంద్రాలను శనివారం ప్రారంభించారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు నేతృత్వంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు కలిసి శాంతినగర్, జక్కంపూడి ప్రాంతాల్లో ఈ కేంద్రాలను ప్రారంభించారు. ఇప్పటికే వాంబే కాలనీ, సింగ్‌నగర్, కృష్ణా హోటల్ సెంటర్, రాజీవ్‌నగర్, రాధానగర్ ఆర్‌ఆర్‌పేట, ఊర్మిలా నగర్‌లో ఆహార పంపిణీ కేంద్రాలు కొనసాగుతున్నాయి. బాబూరావు మాట్లాడుతూ.. వారం రోజులకుపైగా వరద ప్రభావిత ప్రాంతాల్లో పలు ఆహారం పంపిణీ కేంద్రాలను ప్రారంభించి లక్ష మందికి పైగా బాధితులకు ఆహారం అందించామని తెలిపారు. బురద, మురుగుతో పేరుకుపోయిన ప్రతి ఇంటినీ శుభ్రం చేయించే పని ఇంకా పూర్తి కాలేదని, ఆ పనిని త్వరగా పూర్తి చేయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరద బాధితులకు సిపిఎం అండగా నిలుస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, కె.శ్రీదేవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బోయి సత్యబాబు, సెంట్రల్ సిటీ కమిటీ కార్యదర్శి భూపతి రమణారావు, సిపిఎం జిల్లా నాయకులు ఎ వెంకటేశ్వర్లు, టి.ప్రవీణ్, కె.దుర్గారావు తదితరలు పాల్గొన్నారు.

ప్రజా గాయకుడు సన్యాసిరావు కన్నుమూత

- భౌతికకాయాన్ని కెజిహెచ్‌కు అప్పగింత

ప్రజాశక్తి- కలెక్టరేట్, గాజువాక (విశాఖపట్నం)



సన్యాసిరావు (ఫైల్ ఫొటో)

ప్రజా గాయకుడు, కవి, రచయిత, ప్రజానాట్యమండలి సీనియర్ నాయకులు గంగిరెడ్డి సన్యాసిరావు (74) శనివారం కన్నుమూశారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన గాజువాకలోని తన చిన్న కుమారుడు సుందరయ్య ఇంటి వద్ద మరణించారు. 1949లో మల్కాపురంలో సన్యాసిరావు జన్మించారు. విశాఖలో డిప్లొమో పూర్తి చేశారు. బిహెచ్‌పివిలో ఉద్యోగం చేస్తూనే నిరంతరం ప్రజా ఉద్యమాలకు తన పాటల ద్వారా ఉత్సాహాన్ని, ఊపునిచ్చేవారు. తనకు కంటి చూపులేదని ఎన్నడూ తన వృత్తికి, ఉద్యమాలకు దూరం కాలేదు. ఆయన గాయకుడేగాక రచయిత కూడా. ప్రభుత్వాలు ప్రజలపై భారాలు మోపుతే వాటిని పాట, నాటిక రూపంలో మలిచి ప్రజలను చైతన్యం చేయడంలో ఆయనకు ఆయనే సాటి. రెండు వేల వరకూ పాటలు రాసి పాడారు. ఆయన మరణానంతరం భౌతికకాయాన్ని ప్రజలకు ఉపయోగపడేలా వైద్య విద్యార్థుల పరిశోధనకు అందజేయాలన్న కోరిక మేరకు ఆయన భార్య నాగేంద్ర రాజ్యలక్ష్మి, కుమారుడు స్టాలిన్, సుందరయ్య, కుమార్తె చైతన్య, అల్లుడు కృష్ణులు జ్యోతిబసు దేహదాన ప్రోత్సాహక సంస్థ ద్వారా విశాఖ కెజిహెచ్‌లోని అనాటమీ విభాగానికి అప్పగించారు. సన్యాసిరావు మృతికి ప్రజానాట్యమండలి రాష్ట్రకమిటి అధ్యక్ష కార్యదర్శులు పి. మంగరాజు, యస్. అనిల్ సంతాపం తెలియజేశారు.

పార్టీకి తీరనిలోటు : లోకనాథం

సన్యాసిరావు మృతి సిపిఎంకు, ప్రజానాట్యమండలికి తీరనిలోటని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం అన్నారు. సన్యాసిరావు సంతాప సభ గాజువాకలోని ఆయన కుమారుని ఇంటి వద్ద నిర్వహించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ విశాఖలో సిపిఎం, పిఎన్‌ఎం కార్యక్రమాలు, ఉద్యమాలు ఎక్కడ జరిగినా అక్కడ కచ్చితంగా సన్యాసిరావు ఉండేవారన్నారు. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెఎం.శ్రీనివాసరావు, డాక్టర్ బి.గంగారావు, గాజువాక, స్టీల్ జోన్ కార్యదర్శులు ఎం.రాంబాబు, శ్రీనివాసరాజు, పిఎన్‌ఎం జిల్లా కార్యదర్శి ఎం.చంటి తదితరులు నివాళులర్పించారు.

వచ్చే ఏడాది అందుబాటులోకి 12 మెడికల్ కళాశాలలు

- మంత్రి సత్య కుమార్ యాదవ్

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

వచ్చే విద్యాసంవత్సరం నాటికి రాష్ట్రంలో ఉన్న 12 మెడికల్ కళాశాలలను అందుబాటులోకి రానున్నాయని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మెరుగైన వైద్యం అందేలా, మౌలిక సదుపాయలు కల్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. శనివారం ఆయన తూర్పు గోదావరి జిల్లాలో పర్యటించారు. రాజమహేంద్రవరం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా వైద్యాధికారులతో సమావేశమయ్యారు. అనంతరం విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందించే వైద్య సేవల పట్ల ప్రజల్లో విశ్వాసం పెంచే విధంగా చర్యలు చేపడతున్నామన్నారు. ఇటీవల కాలంలో మూడు శిశుమరణాలు సంభవించడం బాధాకరమని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య విధానం కోసం 30 పాయింట్స్ ఫార్ములాను ప్రవేశపెడతామని, ఈ మేరకు ప్రణాళికలను రూపొందిస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.లక్ష్మీసూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

చైతన్య కాలేజీ విద్యార్థిని అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు చంద్రమౌళీనగర్‌లోని శ్రీచైతన్య కళాశాల ఇంటర్ విద్యార్థిని అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నర్సరావుపేటకు చెందిన రేపూరి దివ్య (17) వసతి గృహంలో ఉంటూ ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నారు. శుక్రవారం అర్ధరాత్రి వసతి గృహంలో ఉరి వేసుకుని మృతి చెందినట్టు కళాశాల యాజమాన్యం పోలీసులకు సమాచారమిచ్చింది. అయితే తమ కుమార్తె ఆత్మహత్య చేసుకోలేదని ఆమె మృతిపై అనుమానాలు ఉన్నాయని తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. స్థానిక పట్టాభిపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శాస్త్రీయ దృక్పథంతోనే పురోగతి

(మొదటి పేజీ తరువాయి)

చట్టం తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. జెవివి గౌరవాధ్యక్షులు ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఇప్పుడు అశాస్త్రీయ ఆలోచనలున్న వారు అధికార పీఠమెక్కి కూర్చున్నారని తెలిపారు. శాస్త్రీయ ఆలోచనల వ్యాప్తిలో ఇప్పుడున్న అవరోధాల కంటే రాబోయే రోజుల్లో మరింత ఎక్కువగా ఉంటాయన్న విషయాన్ని సైన్స్ ప్రచారకులు గమనంలో ఉంచుకోవాలన్నారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ పాల్గొని సౌహార్ద సందేశమిచ్చారు. సైన్స్ వేరు, టెక్నాలజీ వేరని వివరించారు. సైన్స్ పెంపుదలపై ప్రస్తుతం తగినంత ప్రోత్సాహం ఉండడం లేదన్నారు. దీన్ని పెంపొందించడంలో కీలకంగా వ్యవహరించే విశ్వవిద్యాలయాల్లోనే పరిశోధనలు జరగకపోవడం శోచనీయమన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్రంలో సైన్స్ ఉద్యమంతో కలసి యుటిఎఫ్ పనిచేస్తోందన్నారు. ప్రస్తుత విద్యా విధానంలో ప్రభుత్వాలు తీసుకొస్తున్న మార్పులతో విద్యార్థుల్లో శాస్త్రీయత కొరవడే అవకాశాలున్నాయని తెలిపారు. సామాజిక కార్యకర్త బోస్ మాట్లాడుతూ విద్య, వైద్యంలో శాస్త్రీయతను పెంపొందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుర్రా రామారావు, ఉపాధ్యక్షులు భాస్కర్, జన విజ్ఞాన వేదిక నాయకులు డాక్టర్ హేమలత, సమతా కన్వీనర్ డాక్టర్ ప్రసూన, జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీనారాయణ, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, మెడికల్ రిప్రజంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు మనోహర్, కవి, రచయిత కంబదూరు షేక్ నబిరసూల్ తదితరులు పాల్గొన్నారు.




మీకోసం

తేనె శుభ్రంగా నిల్వ ఉండాలంటే.. మంచి సీసాలో పోసి అందులో రెండు, మూడు లవంగాలు వెయ్యాలి.

జీవన సౌరభం

ప్రతి అవకాశంలోనూ కొన్ని అడ్డంకులు, ప్రతి అడ్డంకి వెనుకా కొన్ని అవకాశాలు ఉంటాయి.

బుంగ మూతి



'ఏంటో అబ్బాయి గారు అలా బుంగ మూతి పెట్టుకుని కూర్చున్నారు ఏమిటి సంగతి' అని అడిగింది పెద్దమ్మ రుద్రాంశ్ వైపు చూస్తూ. అయినా ఉలుకూ లేదు పలుకూ లేదు. 'మనిద్దరం జట్టు నీకు మినపసున్ని ఇస్తాను. ఏం జరిగిందో చెప్పు' అంది పెద్దమ్మ.

పెద్దమ్మ చేతిలో మినప సున్నుండలు చూడగానే రుద్రాంశ్‌కి నోరూరింది. పెద్దమ్మ దగ్గరికి పరిగెత్తుకుంటూ వెళ్ళాడు. రుద్రాంశ్‌ని దగ్గరగా తీసుకుని తల నిమురుతూ మినప సున్ని చేతిలో పెట్టింది పెద్దమ్మ. తింటూ మాట్లాడబోయాడు.

'తింటూ మాట్లాడకూడదు పలమారుతుంది. అందులోనూ మినపసున్ని గొంతుకకి అంటుకుపోతుంది నెమ్మదిగా తిని నీళ్ళు తాగిన తర్వాత చెప్పు' అంది పెద్దమ్మ.

'సరే' నని తలూపి తినడం పూర్తి అయ్యాక 'ముఖానికి రాసుకునే పౌడరు తీసుకెళ్ళి పెరట్లో ఉన్న కుక్క పిల్లకి రాసి ముస్తాబు చేశాను. అది చూసి అమ్మ నన్ను అల్లరి వెధవ అని తిట్టింది. అందుకే నాకు కోపం వచ్చి నీ దగ్గరికి వచ్చేసా' అన్నాడు గొప్పగా.

'పాడు పనులు చేస్తే తిట్టదా! మరి' అంది పెద్దమ్మ మనసులో నవ్వుకుంటూ. 'పాపం బుజ్జి కుక్కపిల్లకి ఎవరూ పౌడర్ రాయలేదు. అందుకే నేను రాశాను' అన్నాడు రుద్రాంశ్. 'వాటికి నీరు, ఆహారం పెట్టాలి కానీ పౌడరు రాయడం, తిలకం పెట్టడం చెయ్యకూడదు.' అంది పెద్దమ్మ.

ఈ లోపు రుద్రా, రుద్రా అని పిలుస్తూ ఇంట్లోకి వచ్చింది సౌమ్య 'రుద్రాంశ్‌ని చూడగానే చంకలో పిల్లని పెట్టుకుని ఊరంతా తిరిగినట్లు వీడి కోసం ఊరంతా తిరిగాను' అంది. 'నీ కొడుకు బుంగమూతి పెట్టుకుని అలిగి కూర్చుంటే మినపసున్ని ఇచ్చి అలక తీర్చాను' అంది పెద్దమ్మ. 'బుంగ మూతి అంటే ఏంటో చెప్పవా పెద్దమ్మా' అని అడిగింది సౌమ్య.

ఇంట్లోకి వెళ్లి ఒక బూరను తెచ్చి నోట్లో పెట్టి పెద్దగా ఊది మూతిని దారంతో గట్టిగా కట్టింది. 'దీనిని బుంగ అని కూడా అంటారు. బుంగ గుండ్రంగా పెద్దదిగా ఉంది. మరి మూతి చిన్నగా ముడుచుకుని ఉంది. దీనినే బుంగ మూతి అంటారు. చిన్నపిల్లలు బుగ్గల కింద చేతులు పెట్టుకుని అలిగి మూతి ముడుచుకుని కూర్చుంటే బుంగమూతి పిల్లలు అని అంటాము. అని వివరించింది పెద్దమ్మ. 'అయితే ఈ బుంగమూతి బుల్లోడిని తీసుకు వెళతాను' అని రుద్రాంశ్‌ని ఇంటికి తీసుకువెళ్ళింది సౌమ్య.

- కాశీ విశ్వనాథం పట్రాయుడు,
94945 24445.


జంట పదాలు రాయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన పదాలకు సరిపోయే, ప్రచారంలో ఉన్న జంట పదాలను రాయండి చూద్దాం.
(క్లూ ఉపయోగించుకోండి)

వాదోడు, తిప్పలు, పక్కాలు, వందర, చేమ, సంధ్య, పొలాలు, మారు, పక్కాలు, వెలుగులు

చీకటి--	చేదోడు--
పంట--	చదువు--
తిండి--	చాటు--
తారు--	చిందర--
చుట్ట--	చెట్టు--

నేను గీసిన బొమ్మ




ఆర్.గిరి వెంకట్,
8వ తరగతి,
అరవింద హైస్కూల్, సిబిఎస్‌ఇ
కుంచనపల్లి,
గుంటూరు జిల్లా.



పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

కంటి ఆరోగ్యం జాగ్రత్త..



శరీర అవయవాల్లో అత్యంత ప్రధానమైనవి అయినా రోజువారీ పనుల్లో పడిపోయి కళ్ల ఆరోగ్యం గురించి అంతగా పట్టించుకోం. ఆధునిక జీవనశైలి మన కళ్ల ఆరోగ్యాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. మొదట్లో ఇబ్బందిగా అనిపించకపోయినా ఈ అలవాట్లు దీర్ఘకాలంలో కంటి సమస్యలకు దోహదపడతాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కంటి సమస్యలకు కారణమయ్యే కొన్ని అలవాట్లను ఇకనైనా దూరం చేసుకుందాం..

డిజిటల్ తెరల నుండి ఇలా రక్షించుకోవాలి

ప్రస్తుతం మనం స్మార్ట్‌ఫోన్లు, టీవీలు, కంప్యూటర్లు, ల్యాప్‌టాప్‌లను గంటల తరబడి చూస్తున్నాం. దీంతో కళ్లు ఒత్తిడికి గురవుతాయి. పొడిబారడం, మంట, చూపులో సమస్యలు మొదలైనవి తలెత్తుతాయి. ఈ పరికరాల తెరల నుంచి సోకే బ్లూ లైట్ మన నిద్రపై కూడా ప్రభావం చూపుతుంది. డిజిటల్ పరికరాల వాడకం తప్పనిసరి కాబట్టి, 20 20 20 నియమాన్ని పాటించాలి. ప్రతి ఇరవై నిమిషాలకోసారి ఇరవై సెకండ్లు విరామం తీసుకోవాలి. ఓ ఇరవై అడుగుల దూరంలో ఉన్న వస్తువును చూడటమే ఈ విధానం. చిన్నపిల్లలు అదేపనిగా డిజిటల్ తెరలకు అతుక్కుపోతే హ్రస్వదృష్టి సమస్య తలెత్తుతుంది. కాబట్టి, ఆరు బయట ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలి.

సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు

తలనొప్పి, ఎక్కువ రోజులు కళ్లు పొడిబారడం, అలసిపోయినట్టు ఉండటం మొదలైన సమస్యలు తీవ్రమైన కంటి సమస్యలకు తొలి సంకేతాలు. వీటిని నిర్లక్ష్యం చేస్తే మరిన్ని సమస్యలు తలెత్తుతాయి. కాబట్టి కళ్లల్లో ఏమాత్రం అసౌకర్యంగా ఉన్నా, చూపులో ఇబ్బందిగా అనిపించినా వెంటనే కళ్ల డాక్టర్‌ను సంప్రదించడం మంచిది.

రక్తపోటు అదుపులో ఉండేలా

ఆరోగ్యకరమైన శరీరంతోనే ఆరోగ్యకరమైన కళ్లు సాధ్యమవుతాయి. మధుమేహం, అధిక రక్తపోటు ఉన్న వారికి త్వరగా కళ్లపై దుష్ప్రభావం పడుతుంది. మధుమేహ బాధితుల్లో కంటి శుక్లాలు, గ్లకోమా, డయాబెటిక్ రెటినోపతీ, కంటి ఇన్ఫెక్షన్లు తలెత్తే ముప్పు ఎక్కువ. కాబట్టి రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలు, కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో పెట్టుకోవడం అత్యవసరం.

సొంతవైద్యం వద్దు

కళ్లకు ఏదైనా ఇబ్బంది వస్తే డాక్టర్ దగ్గరికి వెళ్లకుండా తెలిసిన వైద్యమో, తెలిసినవాళ్లు చెప్పిందో చేస్తుంటారు. మందుల షాపుకెళ్లి కంటిమంట, అసౌకర్యానికి డ్రాప్స్ వాడతారు చాలామంది. వీటిలో స్టెరాయిడ్స్ ఉండే అవకాశం ఉంటుంది. దీర్ఘకాలంలో ఇవి కళ్లకు హానిచేస్తాయి. కాబట్టి, కంటి డాక్టర్ సూచించిన డ్రాప్స్ మాత్రమే వాడాలి.

అల్ట్రావయొలెట్ కిరణాలు

సూర్యుడి కాంతిలో అల్ట్రావయొలెట్ (యూవీ) కిరణాలు కూడా ఉంటాయి. తగిన జాగ్రత్తలు తీసుకోకుండా ఎండలో తిరిగితే కాలం గడిచేకొద్దీ కళ్లల్లో శుక్లాలు, మాక్యులర్ డిజనరేషన్ (వయసు పెరిగే కొద్దీ తలెత్తే దృష్టిలోపం) లాంటి సమస్యలు తలెత్తుతాయి. సన్ గ్లాసెస్ వాడటం వల్ల అల్ట్రావయొలెట్ కిరణాల నుంచి కళ్లను రక్షించుకోవచ్చు. తరచూ వాడే సన్‌గ్లాసెస్ కూడా యూవీ ఏ, యూవీ బీ రేడియేషన్ నుంచి రక్షణను ఇచ్చేవై ఉండాలి.

తరచూ పరీక్షలు చేయించుకోవాలి

కంటి చూపు బాగుండాలన్నా, కంటి సమస్యల తొలి సంకేతాలను గుర్తించాలన్నా క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలి. డాక్టర్లు సూచించిన కళ్లద్దాలు వాడకపోతే సమస్య ముదిరిపోతుంది. కాబట్టి, కంటి ఆరోగ్యం కాపాడుకోవడానికి నలభై లోపువాళ్లయితే రెండేళ్లకోసారి, నలభై దాటితే ఏడాదికోసారి పరీక్షలు చేయించుకోవడం తప్పనిసరి.

సర్వ మత గణపతి



మొన్న కృష్ణాష్టమి రోజు, ఓ ముస్లిం దంపతులు తమ చిన్నారులకు రాధాకృష్ణుల అలంకరణ చేసి స్కూలుకు తీసుకువెళ్లిన వీడియో సోషల్ మీడియాలో బాగా వైరల్ అయ్యింది. 'ఇది కదా మన దేశం' అని చాలామంది కామెంట్ కూడా చేశారు. 'భారతదేశం ఏ ఒక్క మతానికో చెందినది కాదని, సర్వమత సౌభ్రాతృత్వ దేశం నాద'ని.. కొంతమంది తమ దేశంపై ఉన్న ప్రేమను చాటుకున్నారు కూడా. ఇటువంటి సంఘటనే కర్నాటక చిక్‌మంగుళూరులో చోటుచేసుకుంది.

చిక్‌మంగుళూరు జిల్లా, ఎన్‌ఆర్ పురా టౌన్‌లో జుబేదా అనే ఓ ముస్లిం యువతి నేతృత్వంలో 15 ఏళ్లుగా వినాయకచవితి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఆ ఉత్సవ కమిటీలో హిందువులు, ముస్లింలు, క్రైస్తవులు సభ్యులుగా ఉన్నారు. వారంతా మూడు రోజుల పాటు వినాయక చవితి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తారు. సర్వ ధర్మగల సౌహార్ద్ర గణపతి (సర్వ మత గణపతి) పేరుతో వినాయకుని బొమ్మని ప్రతిష్టిస్తారు.

'విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో అన్ని మతాలకు చెందిన పిల్లలను భాగస్వామ్యం చేస్తాం. వారిలో ఏకతా భావాలను పెంపొందించేలా ఈ కార్యక్రమం జరుపుతాం. కులం, మతం పేరుతో పిల్లల్లో విద్వేషాలు రాకూడదు. మతాలకు అతీతంగా భవిష్యత్తు తరాలు ఎదగాలి' అన్న సందేశం ఇవ్వడమే మా లక్ష్యం' అంటున్నారు జుబేదా. 'కొంతమంది స్వార్థ ప్రయోజనాల కోసం మతవిద్వేషాలు రెచ్చగొడుతున్నారు. మా కార్యక్రమాలు వాళ్లకి చెంపపెట్టు లాంటివి. మతసామరస్య సందేశాన్ని ఈ దేశ యువతలో వ్యాప్తి చేయాల్సిన తరుణమిది' అని కూడా ఆమె అంటున్నారు. నిజమే కదా!



అల్లం రసం.. ఆరోగ్యానికి వరం..

మన రోజువారీ ఆహారంలో అల్లం రసాన్ని చేర్చడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. మెరుగైన జీర్ణక్రియ, రోగనిరోధక శక్తి బరువు నిర్వహణ, రక్తంలో చక్కెర నియంత్రణ లాంటి వాటికి అల్లం రసం ఓ శక్తివంతమైన టానిక్. ఇందులో యాంటీఆక్సిడెంట్లు, యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు పుష్కలంగా ఉంటాయి. అల్లం రసాన్ని క్రమం తప్పకుండా తాగడం వల్ల కలిగే వివిధ ఆరోగ్య ప్రయోజనాలను ఒకసారి చూద్దాం.

జీర్ణ సమస్యలకు చెక్

అజీర్ణం, ఉబ్బరం, వికారం వంటి జీర్ణ సమస్యలకు సహజ నివారణగా అల్లం చాలాకాలంగా ఉపయోగిస్తున్నారు. అల్లం రసం తాగడం వల్ల జీర్ణ వ్యవస్థను ఉత్తేజపరచడానికి, జీర్ణక్రియను మెరుగుపరచడానికి అలాగే జీర్ణశయాంతర బాధ లక్షణాలను తగ్గించడానికి సహాయపడుతుంది.

ఇమ్యూన్ బూస్టర్

అల్లంలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి రోగనిరోధక వ్యవస్థను బలోపేతం చేయడానికి, శరీరాన్ని ఇన్ఫెక్షన్లు, వ్యాధుల నుండి రక్షించడానికి సహాయపడతాయి. అల్లం రసాన్ని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తిని పెంచడానికి, అనారోగ్యాలను దూరంగా ఉంచడానికి సహాయపడుతుంది.

యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు

అల్లంలో శక్తివంతమైన యాంటీ ఇన్ఫ్లమేటరీ లక్షణాలు ఉంటాయి. ఇవి శరీరంలో మంటను తగ్గించడంలో సహాయపడతాయి. అల్లం రసాన్ని క్రమం తప్పకుండా తాగడం వల్ల ఆర్థరైటిస్, కండరాల నొప్పి, వాపును తగ్గించడానికి సహాయపడుతుంది.

బరువు నిర్వహణ

అల్లం రసం జీవక్రియను పెంచి, కొవ్వు కరిగించడాన్ని ప్రోత్సహిస్తుంది. ఆకలిని అణచివేయడానికి సహాయపడుతుంది. కాబట్టి బరువు తగ్గించే ఆహారానికి ఇది గొప్పగా ఉపయోగపడుతుంది.

బ్లడ్ షుగర్ రెగ్యులేషన్

అల్లం రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి, ఇన్సులిన్ సున్నితత్వాన్ని మెరుగుపరచడానికి సహాయపడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి.

ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీ

ఎదురులేని హర్మన్‌ప్రీత్ సేన

- చివరి లీగ్‌లో పాకిస్తాన్‌పై 2-1గోల్స్‌తో గెలుపు
- సెమీస్‌లో భారత్ × కొరియా
- జపాన్‌కు చైనా చెక్



హాంగౌ(చైనా): ఆసియా ఛాంపియన్స్ ట్రోఫీలో భారత హాకీ జట్టుకు ఎదురులేకుండా పోయింది. ఇప్పటికే సెమీస్ బెర్త్‌ను ఖాయం చేసుకున్న హర్మన్‌ప్రీత్ సేన.. శనివారం పాకిస్తాన్‌తో జరిగిన చివరి లీగ్ మ్యాచ్‌లో 2-1గోల్స్‌తో విజయం సాధించింది. దీంతో భారత పురుషుల హాకీ జట్టు పాయింట్ల పట్టికలో అగ్రస్థానంతో సెమీస్‌కు దూసుకెళ్లింది. తొలి గోల్‌ను పాకిస్తాన్ ఆటగాడు అహ్మద్ నదీమ్(9వ ని.) చేయడంతో ఆ జట్టు 1-0 ఆధిక్యతలో నిలిచింది. ఆ తర్వాత భారత్‌కు తొలి అర్ధభాగంలోనే రెండు పెనాల్టీ కార్నర్లు లభించగా.. ఆ రెండు పెనాల్టీలను హర్మన్ గోల్ చేయడంతో భారత్ 2-1గోల్స్ ఆధిక్యతలోకి దూసుకెళ్లింది. శనివారం జరిగిన రెండో మ్యాచ్‌లో ఆతిథ్య చైనా 2-0తో జపాన్‌పై విజయం సాధించింది.

దాంతో, మూడో స్థానంతో సెమీస్ బెర్తు దక్కించుకుంది. దీంతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉన్న భారత్, నాలుగో స్థానంలో నిలిచిన కొరియాల మధ్య సెప్టెంబర్ 16న తొలి సెమీస్, పాకిస్థాన్, చైనా జట్ల మధ్య అదేరోజు రెండో సెమీస్ జరగనుంది. ఐదు, ఆరు స్థానాలకోసం జపాన్, మలేషియా జట్లు మరో మ్యాచ్‌లో పోటీపడనున్నాయి. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్‌కు లీగ్‌లో ఎదురులేకుండా పోయింది. తొలి పోరులో చైనాపై 3-0తో, జపాన్‌పై 5-1తో, కొరియాపై 3-1తో, మలేషియాపై 8-1గోల్స్‌తో భారత్ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే.

దులీప్ ట్రోఫీలో సెంచరీల మోత

ప్రతమ్ సింగ్, తిలక్‌వర్మ, అభిమన్యు ఈశ్వరన్ శతకాలు

- పటిష్ట స్థితిలో ఇండియా - ఎ
- రెండో ఇన్నింగ్స్‌లో 380/3 డిక్లేర్డ్
- ఇండియా- డి లక్ష్యం 488
- ఇండియా-సి బౌలర్ అన్షుల్‌కు ఐదు వికెట్లు





ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం ఆర్‌డిటి క్రీడా మైదానం వేదికగా జరుగుతున్న దులీప్ క్రికెట్ టోర్నీలో బ్యాట్స్‌మన్లు సెంచరీల మోత మోగించారు. శనివారం ముగ్గురు బ్యాట్స్‌మెన్‌లు సెంచరీలు కతం తొక్కారు. ఇండియా-ఎ, డి మ్యాచ్‌లో ఇండియా-ఎ జట్టు క్రీడాకారులు ప్రతమ్ సింగ్, తిలక్‌వర్మలు సెంచరీలు చేశారు. దీంతో ఇండియా-ఏ జట్టు పటిష్ట స్థితికి చేరుకుంది. ఇండియా- సి, బి జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో ఇండియా-బి జట్టు క్రీడాకారుడు అభిమన్యు ఈశ్వరన్ సెంచరీతో కదంతొక్కినా.. ఆ జట్టు ఇంకా ఎదురీదుతోంది. ఇండియా-సి బౌలర్ అన్షుల్ ఐదు వికెట్లు తీసుకున్నాడు.

ఇండియా ఎ 380/3

శనివారం మూడో రోజు ఓవర్‌నైట్ స్కోర్ 115/1తో ప్రారంభించిన ఇండియా-ఏ జట్టు 98 ఓవర్లలో రెండో ఇన్నింగ్స్‌లో 380/3 పరుగులు చేసి డిక్లేర్డ్ చేసింది. జట్టులో ప్రతమ్ సింగ్, తిలక్‌వర్మ సెంచరీలతో అదరగొట్టారు. ప్రతమ్ సింగ్ 189 బంతుల్లో 12 ఫోర్లు, ఒక సిక్సర్ సహాయంతో 122, తిలక్ వర్మ(నాటౌట్) 193 బంతుల్లో 9 బౌండరీలతో 111 పరుగులు చేశాడు. మరో బ్యాట్స్‌మెన్ శాశ్వత్ రావత్ 88 బంతుల్లో 64 (7 ఫోర్లు)తో అర్ధ సెంచరీ చేసి ఆకట్టుకున్నాడు. ఇండియా-డి జట్టు బౌలర్లలో సౌరభ్‌కుమార్ రెండు, శ్రేయస్ అయ్యర్ ఒక వికెట్ తీసుకున్నారు. మొదటి ఇన్నింగ్స్ ఆధిక్యం కలుపుకుని ఇండియా-ఎ జట్టు.. 488 పరుగుల భారీ లక్ష్యాన్ని ఇండియా-డి జట్టు ముందుంచింది. ఆ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో శనివారం మూడోరోజు ఆటముగిసే సమయానికి ఇండియా డి జట్టు 19 ఓవర్లలో వికెట్ నష్టానికి 62 పరుగులు చేసింది. జట్టులో యష్ దుబే 15, రికీ బుయ్ 44 పరుగులతో క్రీజ్‌లో ఉన్నారు. ఇండియా-ఎ బౌలర్ ఖలీల్ అహ్మద్ ఒక వికెట్ తీసుకున్నాడు.

అభిమన్యు మెరుపు సెంచరీ

ఇండియా-సి తో జరుగుతున్న మరో మ్యాచ్‌లో ఇండియా-బి కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ సెంచరీతో అదరగొట్టాడు. ఓపెనర్‌గా బరిలో దిగిన ఈశ్వరన్ చూడచక్కని షాట్లతో అలరించాడు. 262 బంతుల్లో 12 ఫోర్లు, ఒక సిక్సర్ సహా 143 పరుగులతో అజేయంగా క్రీజ్‌లో ఉన్నాడు. మరో ఓపెనర్ నారాయణ్ జగదీషన్ 70 పరుగులు చేశాడు. వీరిద్దరూ మినహా మిగతా బ్యాటర్లు రాణించలేదు. దీంతో ఆ జట్టు మూడోరోజు ఆటముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 101 ఓవర్లలో 7వికెట్లు కోల్పోయి 309 పరుగులు చేసింది. ఇండియా-బి జట్టు ఇంకా 216 పరుగులు వెనుకబడి ఉంది. ఇండియా-సి బౌలర్ అన్షుల్ కాంబోజ్ 5 వికెట్లు పడగొట్టాడు. ఇండియా-సి జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 525 పరుగులు చేసిన విషయం విధితమే.




మాజీ ఉప రాష్ట్రపతి హామీద్ అన్సారీ నివాళి


వియత్నాం రాయబారి నూగియన్ తన్‌హై, బృంద సభ్యులు


పాలస్తీనా రాయబారి అద్నాన్ అబు అల్‌హైజా


నమస్కరిస్తున్న కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ

కామ్రేడ్ ఏచూరికి అరుణాంజలి


నివాళులర్పిస్తున్న సిపిఎం ఎపి రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు, పలువురు నాయకులు

ఐదు దశాబ్దాల పాటు ఈ దేశ ప్రజల ఆకాంక్షలను గొంతెత్తి వినిపించిన మార్క్సిస్టు మహానేత కామ్రేడ్ సీతారాం ఏచూరికి వేలాదిమంది నాయకులు, వామపక్ష అభిమానులు, కార్యకర్తలు కడసారి వీడ్కోలు పలికారు. జీవితాంతం ప్రజల శ్రేయస్సు కోసమే పరితపించిన ఎర్రజెండా ముద్దుబిడ్డకు విప్లవ జోహార్లు అర్పించారు. "కామ్రేడ్ ఏచూరీ ... మీ ఆశయాలను కొనసాగిస్తాం..." అని వేలాదిమంది యువతీ యువకులు, నాయకులు, కార్యకర్తలు పిడికిలెత్తి నినదించారు. ఢిల్లీలోని సిపిఎం కార్యాలయం ఎకెజి భవన్‌లో ఉంచిన ఏచూరి భౌతిక కాయాన్ని వివిధ రాష్ట్రాల నుంచి, పార్టీల నుంచి తరలివచ్చిన నాయకులూ, కార్యకర్తలూ సందర్శించి, ఉబికి వస్తున్న కన్నీళ్లతో, బాధాతప్త హృదయాలతో నివాళులర్పించారు. ఆ తరువాత ప్రదర్శనగా ఆలిండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్)కి వెళ్లి, వైద్య విద్యార్థుల పరిశోధనల నిమిత్తం కామ్రేడ్ సీతారాం ఏచూరి భౌతికకాయాన్ని అక్కడి వైద్యులకు అందజేశారు.


నివాళులర్పిస్తున్న సిపిఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, పలువురు నాయకులు



నివాళులర్పిస్తున్న సిపిఎం కేరళ రాష్ట్ర కార్యదర్శి గోవిందన్, నాయకులు


చైనా రాయబారి ఝూ ఫె మాంగ్


సహచర కామ్రేడ్ ఏచూరికి సిపిఎం పొలిట్ బ్యూరో అంతిమ నివాళి


ఢిల్లీ ఉప ముఖ్యమంత్రి సిసోడియా నివాళి


అంతిమయాత్ర ర్యాలీలో బివి రాఘవులు, శ్రీనివాసరావు, వెంకట్, వైవి, జూలకంటి


ఏచూరికి నివాళులర్పిస్తున్న తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్, మారన్ తదితరులు


నేపాల్ మాజీ ప్రధాని మాధవ్‌కుమార్ నేపాల్



ఏచూరి సతీమణి సీమా చిస్తీని ఓదారుస్తున్న ప్రముఖ చరిత్రకారిణి రొమిల్లా థాపర్, ఎన్‌సిపి నేత శరద్‌పవార్


ప్రొఫెసర్ సాయిబాబా


రాజస్థాన్ మాజీ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్


యుపి మాజీ ముఖ్యమంత్రి అఖిలేష్ యాదవ్


ఎస్ఎఫ్ఐ మాజీ నేతకు విద్యార్థి నాయకుల నివాళి


ఐద్వా నేతల ఘన నివాళి


సిఐటియు నేతలు తపన్‌సేన్, హేమలత నివాళులు


ఏచూరి భౌతికకాయాన్ని
ఎయిమ్స్ అనాటమి విభాగంలోకి తీసుకెళ్తున్న దృశ్యం

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68